నేటి కందం- నేటికి అందం

మారని విలువలతో మమ
కారము లొలికించు గీతికలు వ్రాసిన సీ
తారామ శాస్త్రి ప్రతిమను
తీరుగ నెలకొల్పినట్టి తెలుగుల నెంతున్!!

(సినిమా పాటల రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారి విగ్రహాన్ని ఆయన స్వస్థలమైన అనకాపల్లి లో ఆవిష్కరించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210




# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

అభివృద్ధికి రాష్ట్రంలో
ఆకర్షణ స్కీములు
అన్నిటిలో ఎందుకొరకు
అవనీతి స్కాములు.
ప్రభుత్వాలు మారినా
పరిస్థితులు మారవు
నాయకుల సంపాదన
స్వార్థ స్ఫూర్తులాగవు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 28-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:141 పేజీలు:6 వెల: రూ.1/-


## ఇండియా- యురోపియన్ యూనియన్ మధ్య కుదిరిన భారీ వాణిజ్య ఒప్పందం



న్యూ డిల్లీ జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇండియా–ఈయూ (యురోపియన్ యూనియన్) మధ్య భారీ వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇది చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అని, మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ అని ప్రధాని మోదీ అభివర్ణించారు. మంగళవారం న్యూఢిల్లీలో ఆయన ఈ ప్రకటన చేశారు. యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్, యురోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ అంటోనియో లూయిస్‌తో కలిసి ఉమ్మడిగా మోదీ మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. సోమవారమే దీనిపై ఒప్పందం కుదిరిందన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఇండియా–ఈయూ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్షోభాన్ని నివారించడంలో సాయపడుతుందన్నారు. ఇది ఇండియా, యూరప్ ప్రజలకు అద్భుత అవకాశాలను కల్పిస్తుందని, ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలనపై మన నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందని మోదీ అన్నారు. ప్రపంచ జీడీపీలో ఇండియా–ఈయూ వ్యాపార భాగస్వామ్య వాటా 25 శాతం ఉందని పేర్కొన్నారు. ఇండియా–ఈయూ మధ్య 1962 నుంచి నుంచి వ్యాపార, వాణిజ్య ఒప్పందం కొనసాగింది. ఇది 2004 నుంచి వ్యూహాత్మకంగా మారింది. ఈ రెండు దశాబ్దాలలో ఎదురైన అనేక అవరోధాలకు తాజా ఒప్పందం చెక్ పెట్టబోతుంది. ఇప్పుడు కుదిరిన ఈ ఒప్పందం అంతర్జాతీయంగా కీలకంగా మారనుంది. ట్రంప్ టారిఫ్‌లు, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వంటి అంశాలు అంతర్జాతీయ మార్కెట్లను గందరగోళంలో నెట్టేశాయి. ఈ సమయంలో ఇండియా–ఈయూ ఒప్పందం అంతర్జాతీయ వాణిజ్యానికి సానుకూల సంకేతాల్ని అందిస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇండియాకు ఈయూ అతిపెద్ద వ్యాపార భాగస్వామిగా ఉంది. ఈయూ–ఇండియా మధ్య 2024–25 మధ్య 136 బిలియన్ అమెరికన్ డాలర్ల వ్యాపారం జరిగింది. భారత తయారీ, క్లీన్ ఎనర్జీ, డిజిటల్ వంటి రంగాల్లో ఈయూ కంపెనీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మరోవైపు భారత ఐటీ కంపెనీలు, ఫార్మా వంటి సంస్థలు యూరప్‌లో సేవలందిస్తున్నాయి.

## బంగ్లాదేశ్‌లో హిందువుల హంతకులకు రక్షణ.. యూనస్ ప్రభుత్వం ఆర్డినెన్స్

న్యూఢిల్లీ, జనవరి 27:బంగ్లాదేశ్‌లో ఒక పక్క హిందువులు, మైనారిటీలపై దాడులు జరుగుతుంటే వీటిని అడ్డుకోవాల్సిన అక్కడి ప్రభుత్వం నిందితులకు అండగా నిలుస్తోంది. హంతకులు, ఆందోళనకారులకు రక్షణ కల్పించే చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా తర్వాత ముహమ్మద్ యూనస్ ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అక్కడ ఆందోళనలు ఎక్కువయ్యాయి.

పోలీసులు, భద్రతా బలగాలతోపాటు హిందువులపై, రాజకీయ ప్రత్యర్థులపై ఆందోళనకారులు దాడులు, హత్యలు చేశారు. గత ఏడాది జులై–ఆగష్టు సమయంలో ఈ దాడులు ఎక్కువగా జరిగాయి. ఈ ఘటనల్లో పోలీసులతోపాటు హిందువులు, ఇతర పౌరులు మరణించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు భారీగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన యూనస్ ప్రభుత్వం ఇప్పుడు వారికి అండగా నిలిచింది. వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రొటెక్షన్ అండ్ లయబిలిటీ డిటర్మినేషన్ ఆర్డినెన్స్ 2026ను ఆదివారం అర్ధరాత్రి జారీ చేసింది. దీని ప్రకారం ఈ ఘటనల్లో నిందితులకు రక్షణ ఉంటుంది. వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వీల్లేదు. నిందితులపై ఇప్పటివరకు నమోదైన సివిల్, క్రిమినల్ కేసుల్ని రద్దు చేస్తారు. అలాగే కొత్త కేసులు నమోదు చేయడానికి వీల్లేదు. దీంతో జూలై, ఆగష్టులో పోలీసులు, హిందువులు, మైనారిటీలు, అవామీ లీగ్ సభ్యుల్ని చంపిన వారిపై చర్యలుండవు. ఇస్లామిస్టులు, అతివాదులు అయిన హంతకులు ఇకపై స్వేచ్ఛగా తిరుగుతారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా అప్పట్లో ఆందోళనకారులు తీవ్ర హింసకు పాల్పడ్డారు.

## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల



-జనవరి 28 నామినేషన్‌లు ప్రారంభం
-నామినేషన్‌లకు గడువు- జనవరి 30
-నామినేషన్‌ల స్క్రూటినీ - జనవరి 31,నామినేషన్‌లు ఉపసంహరణ
-ఫిబ్రవరి 3,పోలింగ్- ఫిబ్రవరి 11,కౌంటింగ్
పోలింగ్ టైమ్ - ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.

హైదరాబాద్ జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్రంలోని ఏడు నగరపాలక సంస్థలు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగనున్నాయి. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సమావేశమై ఎన్నికల నిర్వహణపై చర్చించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. షెడ్యూల్ విడుదలతో తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నెల 28 వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 30వ తేదీతో నామినేషన్ల స్వీకరణకు గడువు ముగియనుంది. ఈ నెల 31న స్క్రూటినీ నిర్వహించి పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా వెల్లడించనున్నారు. ఫిబ్రవరి 1న తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 3వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు. అదేరోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52 లక్షల 43 వేల మందికిపైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు.

ఇదీ షెడ్యూల్

నామినేషన్‌లు ప్రారంభం – జనవరి 28,నామినేషన్‌లకు గడువు–జనవరి 30,నామినేషన్‌ల స్క్రూటినీ–జనవరి 31,నామినేషన్‌లు ఉపసంహరణ – ఫిబ్రవరి 3,పోలింగ్–ఫిబ్రవరి 11,కౌంటింగ్–ఫిబ్రవరి 13,పోలింగ్ కేంద్రాలు–8,1 95,పోలింగ్ టైమ్–ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.

## ప్రత్యేక పూజలతో మేడారానికి పగిడిద్దరాజు



మహబూబాబాద్, జనవరి 27: మేడారం మహాజాతర నేపథ్యంలో గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు మేడారం వైపు బయలుదేరారు. సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కోయ పూజారులు పగిడిద్దరాజును ఘనంగా మేడారం తీసుకొస్తున్నారు. పూనుగొండ్ల గ్రామంలో ఉదయం నుంచే పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించగా, కోయ గిరిజనులు సంప్రదాయ వేషధారణలో పగిడిద్దరాజుకు పూజలు చేశారు. పూజల అనంతరం భక్తుల నినాదాల మధ్య ఊరేగింపుగా పగిడిద్దరాజును మేడారం దిశగా తీసుకువస్తున్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన సంప్రదాయాలు, ఆచారాలకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని మంత్రి తెలిపారు. మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిందని, ఈ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆమె వెల్లడించారు.

కాగా, ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర వైభవంగా జరుగనుంది. ఈ జాతర కోసం ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన జాతర ప్రారంభానికి ముందే గత కొన్ని రోజులుగా భక్తులు పెద్ద సంఖ్యలో మేడారం జాతరకు చేరుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

## సమ్మక్క తల్లి అంగరక్షకురాలు గట్టమ్మ తల్లి



మేడారం ,జనవరి 27: సమ్మక్క తల్లికి అంగరక్షకురాలు గట్టమ్మ తల్లి. మేడారం గిరిజన రాజ్య స్వతంత్రం కోసం, గిరిజనుల సాధికారత కోసం కాకతీయులతో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, జంపన్న, గోవిందరాజు, నాగులమ్మ తదితరలు భీకర యుద్ధం చేసిన సమయంలో సమ్మక్క తల్లికి గట్టమ్మ తల్లి అంగరక్షకురాలుగా ఉండి అసమాన, ధైర్య, శౌర్య, పరాక్రమాలతో, త్యాగశీలంతో శత్రువులతో రణం చేసి గొప్ప యుద్ధ వీరవనితగా పేరు తెచ్చుకుని చరిత్రకెక్కింది.

సమ్మక్క తల్లికి గట్టమ్మ తల్లి నమ్మిన బంటుగా ఉండడంతో కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడితో జరిగిన యుద్ధంలో సమ్మక్క తల్లి కుటుంబంతో పాటు ఎంతోమంది ఆదివాసి, గిరిజన, కోయవీరులు అమరులైనప్పటికీ వారందరికన్నా గట్టమ్మ తల్లికే ఎక్కువ కీర్తి దక్కింది. అందుకే గట్టమ్మ తల్లిని కూడా గిరిజనులు దేవతగా మలుచుకుని గుడి కట్టి గట్టమ్మకు పూజలు చేస్తున్నారు.

## యాసిడ్ దాడి నిందితుల ఆస్తులు ఎందుకు వేలం వేయకూడదు.. రాష్ట్రాలకు సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, జనవరి 27: యాసిడ్ దాడి ఘటనల్లో బాధితులకు సాయం అందించేందుకు అవసరమైతే నిందితుల ఆస్తుల్ని ఎందుకు వేలం వేయకూడదో చెప్పాలని రాష్ట్రాలను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. బాధితులకు పునరావాసం, పరిహారం, చికిత్స వంటి వాటికోసం ఈ ఆస్తిని వాడుకోవచ్చు కదా అని సుప్రీం కోర్టు సూచించింది. యాసిడ్ దాడిలో గాయపడి, కోలుకున్న షహీన్ మాలిక్ అనే మహిళ 2009లో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు తాజా వ్యాఖ్యలు చేసింది.

చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ దీనిపై స్పందించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. యాసిడ్ దాడి బాధితులకు కనీస పరిహారంగా అందిస్తున్న రూ.3 లక్షలు సరిపోవని వ్యాఖ్యానించింది. ఈ పరిహారం పెంచేందుకు అవసరమైతే నిందితుల ఆస్తుల్ని జప్తు చేసి, వేలం ఎందుకు వేయకూడదో చెప్పాలని సూచించింది. యాసిడ్ దాడి ఘటనల్లో నిందితులకు అత్యంత కఠినమైన శిక్షలు వేయడం ద్వారా ఈ తరహా నేరాల్ని నియంత్రించాలని కోర్టు అభిప్రాయపడింది. కోర్టు వ్యాఖ్యల ప్రకారం.. ప్రస్తుతం అందిస్తున్న మూడు లక్షల కనీస పరిహారం బాధితుల చికిత్స కోసం సరిపోదు. కొందరికి జీవిత కాల చికిత్స అవసరం. అలాగే పరిహారం, పునరావాసం వంటికి కూడా ఈ డబ్బులు సరిపోవు. అందుకే పరిహారం పెంచాలని, నిందితుల ఆస్తుల్ని జప్తు చేసి, వేలం వేసే విషయం గురించి ఆలోచించాలని సూచించింది.

ప్రతి బాధితురాలి కేసు వాదించేందుకు హైకోర్టులో టాప్ లాయర్‌ను నియమించాలని కూడా ఆదేశించింది. తాను యాసిడ్ దాడి కేసులో 16 ఏళ్లుగా పోరాడుతున్నానని, తనకు న్యాయం జరగలేదని, నిందితులంతా కింది కోర్టుల్లోనే విడుదలయ్యారని బాధితురాలు కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఈ పోరాటంలో తాను జీవితంలో ఎంతో విలువైన సమయాన్ని కోల్పోయానని చెప్పింది. దీనిపై స్పందించిన కోర్టు తాజా సూచనలు చేసింది. అలాగే వివిధ రాష్ట్రాల్లో ఉన్న యాసిడ్ దాడి కేసుల వివరాలు, బాధితుల వివరాలు, నిందితులకు పడ్డ శిక్ష వంటి వివరాలు సమర్పించాలని రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది.

## అధిక ఫీజులతో దోచుకుంటున్నారు.. : కోమటిరెడ్డి

నల్గొండ, జనవరి 27: కార్పొరేట్ స్కూళ్లలో అధిక ఫీజులతో ప్రజలను దోచుకుం టున్నారని.. తాను విద్యాశాఖ మంత్రి అయితే సదరు స్కూళ్లను మూసివేయిస్తానని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. విద్య వ్యాపారం కావద్దని తేల్చిచెప్పారు. మంగళవారం నల్లగొండ టౌన్‌లోని బొట్టుగూడలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను ఆయన ప్రారంభించారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'నల్లగొండ ప్రజల రుణం తీర్చుకోవడానికే నల్లగొండ మున్సిపాలిటీని కార్పొరేషన్ చేశా. కేంద్రం నుండి నిధులు తెచ్చి నల్లగొండ రూపు రేఖలు మారుస్తా'..

'నేను ప్రధాని నరేంద్ర మోదీని కలిస్తే వెయ్యి, 2 వేల కోట్ల రూపాయల నిధులైనా ఇస్తారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుంది. నాకు ఉత్సాహం ఉంటే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తా. లేకుంటే ప్రతీక్ స్కూల్‌లో విద్యార్థులను చదివిస్తూ జీవితం గడుపుతా. ఈ స్కూల్ విద్యార్థులను ఆణిముత్యాల్లా తీర్చిదిద్ది ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తయారు చేయాలి. నిజాయితీగా బతికా.. పేద వారికి సహాయం చేశా. చదువంటే ర్యాంకులు మాత్రమే కాదని ఓ ఆలోచన చేశాం. విద్యకు ప్రాధాన్యత ఇచ్చి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నాం. బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలలో పూర్తిగా డిజిటల్ విద్యను అందిస్తాం' అని అన్నారు.

## బంగ్లాదేశ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్స్ తిరస్కరణ..

న్యూఢిల్లీ, జనవరి 27:పంతానికి పోయి టీ20 వరల్డ్‌కప్ అవకాశాన్ని చేజార్చుకున్న బంగ్లాదేశ్‌కు ఐసీసీ మరో షాకిచ్చింది. ప్రపంచకప్ మ్యాచ్‌ల కవరేజీ కోసం దరఖాస్తు చేసుకున్న ఆ దేశానికి చెందిన క్రీడా జర్నలిస్టులకు అనుమతి నిరాకరించింది. దాదాపు వందకుపైగా అప్లికేషన్లను అంతర్జాతీయ క్రికెట్ మండలి తిరస్కరించింది దాంతో.. తమ బోర్డు చేసిన తప్పిదానికి మమల్ని శిక్షించవద్దని వారు వేడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మీడియా అక్రిడిటేషన్స్ జారీని మరోసారి పరిశీలిస్తామని ఐసీసీ వెల్లడించింది.

భారత్‌లో వరల్డ్‌కప్ కోసం తమ జట్టును పంపబోమని బెట్టుచేసిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. భద్రతా కారణాలను సాకుగా చూపి మేము ఆడమంటే ఆడమని పంతం పట్టినందుకు బంగ్లాదేశ్‌ను తప్పించిన స్కాంట్లాండ్‌కు అవకాశమిచ్చింది ఐసీసీ. ఇప్పుడు వరల్డ్‌కప్ కవరేజీ కోసం దరఖాస్తు చేసుకున్న క్రీడా జర్నలిస్ట్‌లకు అనుమితివ్వలేదు ఐసీసీ. ఈ విషయంపై బంగ్లా బోర్డు మీడియా అధ్యక్షుడు హంజద్ హ్సాసేన్ తిరస్కరణకు కారణాలు తెలపాలని ఐసీసీని కోరాడు.

## మురికి కాలువను జేసీబీతో తొలగింపు




హైదరాబాద్, జనవరి 27: రెంజల్ మండలం సాటాపూర్ గ్రామంలో హనుమాన్ మందిరం నుండి పెద్ద చెరువు వరకు పేరుకుపోయిన మురికి కాలువను జెసిబీ సహాయంతో శుభ్రం చేశారు. గత 12 ఏళ్ల బీఆర్ఎస్ హయాంలో చేయలేని అభివృద్ధి పనులు కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు,స్థానిక ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు, స్థానిక సర్పంచ్ లచ్చావార్ సుహాసిని ఆధ్వర్యంలో శుభ్రం చేయించారు.

సర్పంచుల ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నెరవేర్చడం జరిగిందని అన్నారు. ఓబిసి మండల అధ్యక్షుడు లచ్చావార్ నితిన్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు కురుమే సాయిలు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంతం గంగారం, కార్యదర్శి మహబూబ్ అలీ, వార్డు సభ్యులు గోసం గంగాధర్, దెబ్బడా రాజు, సభావాత్ అశోక్, దండు అనిల్, దేవీలాల్ లక్ష్మణ్, చాకలి భూమయ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఆహ్వానం
తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో
పుస్తక ఆవిష్కరణ సభ
విశ్వసాహిత్యం
ప్రపంచ ప్రఖ్యాత గ్రంథాల పరిచయం
(వ్యాస సంకలనం)
తెలుగు సాహితీవనం 10వ ప్రచురణ
సభాధ్యక్షులు
శాంతి కృష్ణ
ముఖ్య అతిథి
డా. సి. మృణాళిని
గ్రంథ పరిచయం
ఆడెపు లక్ష్మీపతి
ఆత్మీయ అతిథి
డా. కృష్ణారావు రెడ్నం
గౌరవ అతిథులు
అంపశయ్య నవీన్
ఏనుగు నరసింహారెడ్డి
చెలమచర్ల భాస్కర్ రెడ్డి
సత్యాజీ
స్వాతి శ్రీపాద
చమన్
సంపత్ కుమార్
కొల్లూరి సోమశంకర్
సమన్వయం
సుమన ప్రణవ్
వందన సమర్పణ
కంచిపాటి వెంకట్
తేదీ: 29.01.2026 గురువారం,
ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 1గంట వరకు
వేదిక: రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్

# తెలంగాణ కుంభమేళా : సమ్మక్క సారలమ్మ మహా జాతర

## (28 జనవరి "మేడారం గిరిజన జాతర ప్రారంభోత్సవం" శుభ సందర్భంగా)

కుంభమేళ తర్వాత అత్యధిక భక్తులు హాజరయ్యే గిరిజన జాతరను "మేడారం లేదా సమ్మక్క - సారలమ్మ జాతర"గా పిలుస్తాం. దీనినే "తెలంగాణ కుంభమేళ" అని కూడా నామకరణం చేస్తున్నారు. 1996లోనే తెలంగాణ ప్రభుత్వం మేడారం జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. పూర్వ వరంగల్ జిల్లా, ప్రస్తుత మురుగు జిల్లా, తాడ్వాయా మండల కేంద్రానికి 14 కిమీ దూరంలోని మేడారం గ్రామంలో రెండేళ్లకోసారి ఈ గిరిజన జాతర పెద్ద ఎత్తున జరుగుతుంది. ఈ జాతరకు హాజరైనా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో బెల్లాన్ని బంగారంగా సమర్పించడం, జంపన్న వాగులో స్నానాలు చేయడం పరిపాటి అయ్యింది. కులమతాలు అతీతంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే గిరిజన వనజాతర రోజు రోజుకు భక్తుల వరదలు పెరుగుతున్నాయి. దాదాపు 10 కోట్ల జనులు హాజరు అవుతారని గమనించిన తెలంగాణ ప్రభుత్వం రూ: 100 కోట్లు వెచ్చించి భారీ నిర్మాణాలు, మౌళిక వసతులు కల్పించడానికి పూనుకోవడం ముదావహం.

### వన్యమృగాల మధ్య దొరికిన దైవాంశ సంభూతురాలు సమ్మక్క:

కోయ తెగకు చెందిన సమ్మక్క భర్త పగిడిద్ద రాజు, కుమార్తెలు సారలమ్మ (నాగులమ్మ), కుమారుడు జంపన్న, అల్లుడు గోవింద రాజులకు ప్రత్యేక గద్దెలు నిర్మించి పూజలు నిర్వహిస్తారు. కోరిన కోర్కెలు తీర్చి, రక్షించే దేవతలుగా వీరిని కొలుస్తారు. క్రీ. శ. 1260 నుంచి 1320 వరకు ఓరుగల్లును పాలించిన చక్రవర్తి ప్రతాపరుద్రుడి కాలం నుంచి ఈ జాతర జరుగుతున్నట్లు పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. మేడారం ప్రాంతాన్ని కాకతీయ రాజుల సామంతరాజుగా పగిడిద్ద రాజు పాలించే వారు. పూర్వ కరీంనగరం జిల్లా, జగిత్యాల ప్రాంతాన్ని పాలించిన మేడరాజు మేనల్లుడు పగిడిద్దరాజు. మేడరాజుకు అడవిలో పుట్ట మీద కేరింతలు కొడుతూ పాప రూపంలో సమ్మక్క కనిపించింది. సమ్మక్కకు రక్షణగా పులులు కాపలా కాస్తూ, సింహాల నుంచి రక్షించాయని, అందువల్ల ఆమెను దైవాంశ సంభూతురాలిగా భావించారు. సమ్మక్క వివాహం మేడారం ప్రాంత రాజైన తన మెనల్లుడు పగిడిద్దరాజుతో చేసారు. సమ్మక్క, పగిడిద్ద రాజు దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు.

### కాకతీయ రాజులతో గిరిజన రాజుల వీరోచిత పోరాటం:

నాటి కాలంలో వరుసగా 3, 4 ఏండ్ల పాటు మేడారం అనావృష్టితో కరువు కోరల్లో చిక్కుతుంది. అక్కడి ప్రజలు కాకతీయ రాజులకు పట్టం కట్టలేక పోయారు. దానితో కోపించిన కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు మేడారం సామంతరాజు పగిడిద్ద రాజుపై కోపంతో మాఘ శుద్ధ పౌర్ణమి రోజు మైదారంపై దండయాత్రకు సైన్యాన్ని పంపించారు. కాకతీయ సైన్యానికి ఎదురుగా పగిడిద్ద రాజు, సమ్మక్క, సారలమ్మ, నాగులమ్మ, జంపన్న, గోవిందరాజులు సంపెంగ వాగు వద్ద నిలబడి భీకర పోరాటం చేశారు. ఈ పోరాటంలో సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు వీరమరణం పొందగా, ఓటమి అవమానాన్ని తట్టుకోలేదు సంపెంగ వాగులోకి దూకి జంపన్న మరణించాడు. గోదావరి నదికి ఉపనదిగా సంపెంగ వాగు పారుతోంది. నాటి నుంచి సంపెంగ వాగును జంపన్న వాగ అని పిలవడం జరుగుతోంది. ఇద్దరు కుమార్తెలు సారలమ్మ, నాగులమ్మ, కుమారుడు జంపన్న, అల్లుడు గోవిందరాజులు మరణించారనే వార్త విన్న తల్లి సమ్మక్క ఆవేశంతో ఈటెలు, బళ్ళాలు పట్టి కాకతీయ సైన్యాన్ని కాకవికలం చేసింది. ఈ పోరులో వెనుక నుంచి సమ్మక్కను కాకతీయ సైనికులు పొడవగా, క్రితపు ధారలతో యుద్ధ భూమి నుంచి నిష్క్రమించి చిలుకల గుట్ట వైపు వెళ్లి, వెంట వెళ్లిన తన వారికి సహితం దొరక్కుండా చిలుకలమ్మ గుట్ట వద్ద అదృశ్యం అయ్యింది. ఆమె అదృశ్యం అయిన చోట పసుపు, కుంకుమతో కూడిన కుంకుమ భరిణ దొరకడంతో దానిని సమ్మక్క దేవతగా భావించడంతో జరుగుతున్నది.

### తెలంగాణ కుంభమేళ ప్రధాన ఘట్టాలు:

ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించబడే వనదేవతల మేడారం జాతర ప్రధానంగా 4 రోజుల పాటు మహా ఉత్సవంగా జరుగుతోంది. 2026లో జనవరి చివరి వారంలో ప్రారంభం అయ్యే వనదేవతల పూజల్లో పలు ఘట్టాలు ఉంటాయి. 14 జనవరి 2026 రోజు గుడి మెలిగె పండుగ రూపంలో వనదేవతలకు ధూపదీప నైవేద్యాలతో పూజలు చేస్తారు. 21 జనవరి రోజున మండమెలిగె పండుగ పాటిస్తారు. 27 జనవరి రోజున మహబూబాబాదు జిల్లా నుంచి పగిడిద్దరాజు, కన్నెపల్లి నుంచి జంపన్న మేడారం పయనమై గద్దెలపై కొలువు తీరుతారు. జనవరి 28 రోజు కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయి నుంచి గోవిందరాజు, పూనుగొండ్ల నుంచి పగిడిద్ద రాజులు గద్దెలపై కొలువుతీరుతారు. 29 జనవరి రోజు చిలుకలమ్మ గుట్ట నుంచి కుంకుమ భరిణె రూపంలో సమ్మక్క దేవతను కోయ పూజారులు, భక్తుల పూనకాలు, శివసత్తుల విన్యాసాల నడుమ తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. జనవరి 30 రోజున భక్తులు నిలువెత్తు బంగారాన్ని (బెల్లాన్ని) మొక్కులుగా గద్దెల వద్ద సమర్పిస్తారు. 31 జనవరి రోజు దేవతలు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర వేడుకలు ముగుస్తాయి. 04 ఫిబ్రవరి 2026 రోజు తిరుగువారం పండుగతో గిరిజ ఉత్సవాలు అధికారికంగా సమాప్తం అవుతాయి.

తెలంగాణతో పాటు ఆంధ్ర, మహారాష్ట్ర, ఎంపీ, ఒడిసా, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ లాంటి పలు రాష్ట్రాల నుంచి దాదాపు 10 కోట్ల మంది భక్తులు హాజరు కావచ్చని అంచనా వేస్తున్నారు. సమస్త గిరిజనుల సమారాధ్య వనదేవతలు, కష్టాలను కడతేర్చే కలియుగ దైవాలుగా. ఆపదలో ఉన్న వారిని ఆదుకునే ఆపద్బాందవులుగా నేడు దేశవ్యాప్తంగా పేరొందింది మన అతి పెద్ద మేడారం సమ్మక్క-సారలమ్మ గిరిజన జాతర. సుశిక్షితులైన కాకతీయ సేవలకు ఎదురుగా వీరోచితంగా పోరాటం కొనసాగించి ముప్పు తిప్పలు పెట్టడం చూసిన ప్రతాపరుద్రుడు ఆశ్చర్య చకితుడయ్యాడు. ఈ తెలంగాణ కుంభమేళాను చేరి వనదేవతల దీవెనలు పొంది ఆయురారోగ్య సంపదలను పొందాలని కోరుకుందాం.



– ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

---

# రిపబ్లిక్ డే పరేడ్‌లో భారతదేశ కథా వారసత్వాన్ని, వేవ్స్ దార్శనికతను చాటిచెప్పిన ఎంఐబీ శకటం




న్యూఢిల్లీ, జనవరి 27:గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఇవాళ కర్తవ్యపథ్‌లో ప్రదర్శించిన శకటం వివరాలు ఇలా ఉన్నాయి "భారత్ గాథ: శృతి, కృతి, దృష్టి" పేరుతో రూపొందించిన శకటం, భారతదేశపు సుసంపన్న కథా వారసత్వాన్ని, ప్రాచీన మౌఖిక సంప్రదాయాల నుంచి నేటి ఆధునిక మీడియా, సినిమా వరకు సాగిన ప్రయాణాన్ని, దేశ సాంస్కృతిక వికాసాన్ని, కంటెంట్ క్రియేషన్ రంగంలో ప్రపంచ వేదికపై భారత్ శక్తిమంతమైన కేంద్రంగా ఎదిగిన తీరుని ఈ శకటం ప్రతిబింబించింది.

77వ గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌లో ప్రదర్శిం చిన ఈ శకటం, వేవ్స్ వేదిక ప్రాముఖ్యతను చాటిచెప్పింది. భారత మీడియా, వినోద రంగ నాయకత్వం, ఆవిష్కరణలు, సాంస్కృతిక దౌత్యాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే వేదికగా ఇది నిలిచింది. అంతేకాక, ప్రాచీన నాగరికత వారసత్వాన్ని ఆధునిక సాంకేతికతో అనుసంధానిస్తూ సంప్రదాయాలను, భవిష్యత్ కథ నాలను అద్భుతంగా ఆవిష్కరిం చింది.

## పౌరులే ప్రధానంగా సాగే పాలన, రాజ్యాంగ విలువలపై కథనాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 27:గణతంత్ర దినోత్సవం సందర్భంగా రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ రాసిన కథనాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు.

నేటి పాలనలో పౌరులే ప్రధానమని ఈ కథనం వివరిస్తుంది. సామాజిక న్యాయాన్ని పెంపొందిస్తూ, ఆర్థిక సమ్మిళితత్వాన్ని మన గణతంత్ర రాజ్యం సాధ్యం చేస్తుందని, ఈ ఉమ్మడి కృషి ద్వారా రాజ్యాంగం నిర్దేశించిన సంక్షేమ ప్రజాస్వామ్య గణతంత్ర దార్శనికతను కాపాడుతుందని పేర్కొంటుంది.

పైన చెప్పిన కథనంపై రక్షణ మంత్రి చేసిన 'ఎక్స్' పోస్టుకు స్పందిస్తూ శ్రీ నరేంద్ర మోదీ ఇలా పేర్కొన్నారు:

"గణతంత్ర దినోత్సవం సందర్భంగా, నేటి పరిపాలనలో పౌరులే ప్రధానమని రక్షణమంత్రి శ్రీ ఏతీజీతీనిజీబిష్ణబతినిణష్ణ తీతి తెలిపారు. మన గణతంత్రం సామాజిక న్యాయాన్ని పెంపొందించటంతో పాటు ఆర్థిక సమ్మిళితత్వాన్ని సాధ్యం చేస్తోందని ఆయన అన్నారు. మన రాజ్యాంగం ఆశించిన సంక్షేమ ఆధారిత ప్రజాస్వామ్య గణతంత్ర దార్శనికతను ఈ ఉమ్మడి కృషి నిలబెడుతుంది".

# ఉత్సాహం, జాతీయ గర్వంతో నిండిన గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రశంసించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 27:గణతంత్ర దినోత్సవ వేడుకలను భారత్ ఎంతో ఉత్సాహంతో, గర్వంతో జరుపుకుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

కర్తవ్య పథ్‌లో జరిగిన అద్భుతమైన కవాతు.. భారత ప్రజాస్వామ్య శక్తిని, మన గొప్ప వారసత్వ సంపదను, దేశాన్ని ఏకం చేసే ఐక్యతను చాటిచెప్పిందని ఆయన తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించిన దృశ్యాలను పంచుకుంటూ.. గణతంత్ర దినోత్సవ వేడుకల వేళ కర్తవ్యపథ్‌లో దేశ గర్వానికి ప్రతీకగా నిలిచిన శక్తిమంతమైన ప్రదర్శనకు సాక్ష్యంగా నిలిచిందని ప్రధానమంత్రి అన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు శ్రీ ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు శ్రీమతి ఉర్సులా వాన్ డెర్ లేయన్‌లకు ఆతిథ్యం ఇవ్వడం భారత్‌కు దక్కిన గౌరవమని ప్రధానమంత్రి అన్నారు. వారి రాక భారత్-యూరోపియన్ యూనియన్ భాగస్వామ్యానికి పెరుగుతున్న బలాన్ని, ఉమ్మడి విలువలపై దేశానికి ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటన భారత్-యూరప్ మధ్య వివిధ రంగాలలో లోతైన నిబద్ధత, సహకారానికి మరింత ఊపునిస్తుందని అన్నారు.

గణతంత్ర దినోత్సవ కవాతు భారతీయ అద్భుతమైన భద్రతా వ్యవస్థను ప్రదర్శించిందని, ఇది దేశ సన్నద్ధతను, సాంకేతిక సామర్థ్యాన్ని, పౌరుల రక్షణ పట్ల అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి అన్నారు.

బలోపేతమవుతున్న దేశ భద్రతా దళాల సామర్థ్యాలను గణతంత్ర దినోత్సవ కవాతు కళ్లకు కట్టిందని శ్రీ మోదీ అన్నారు. మన భద్రతా దళాలు నిజంగా దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. కవాతు సమయంలో భద్రతా దళాల ఆకట్టుకునే ప్రదర్శనలకు సంబంధించిన దృశ్యాలను ఆయన పంచుకున్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కర్తవ్య పథ్‌లో భారతదేశ సాంస్కృతిక వైవిధ్యం కనువిందు చేసిందని ఆయన అన్నారు. వైవిధ్యభరితమైన ప్రదర్శనలు, శకటాల ద్వారా ఈ కవాతు దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటిచెప్పిందని అన్నారు. ఇది దేశం సుసంపన్నమైన, వైవిధ్యమైన వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని శ్రీ మోదీ పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చేసిన వరుస పోస్టుల్లో ప్రధానమంత్రి ఇలా పేర్కొన్నారు.

"గణతంత్ర దినోత్సవాన్ని భారత్ ఎంతో ఉత్సాహంతో, గర్వంతో జరుపుకుంది.

"నేడు జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల జరిగిన కర్తవ్య పథ్ మార్గం.. జాతీయ గర్వానికి శక్తిమంతమైన ప్రదర్శనగా నిలిచింది.

"మన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌లకు ఆతిథ్యం ఇవ్వడం దేశానికి దక్కిన గౌరవం.

వారి రాక భారత్-యూరోపియన్ యూనియన్ భాగస్వామ్యానికి పెరుగుతున్న బలాన్ని, ఉమ్మడి విలువలపై మన నిబద్ధతను తెలుపుతుంది. ఈ పర్యటన భారత్, యూరప్ మధ్య వివిధ రంగాల్లో లోతైన నిబద్ధత,సహకారానికి మరింత ఊపునిస్తుంది.

"నేడు గణతంత్ర దినోత్సవ కవాతు భారత దేశ అద్భుతమైన భద్రతా వ్యవస్థను ప్రదర్శించింది. ఇది దేశం సన్నద్ధతను, సాంకేతిక సామర్థ్యాన్ని, పౌరుల రక్షణపై అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది."

"బలోపేతమవుతున్న దేశ భద్రతా దళాల సామర్థ్యాలను గణతంత్ర దినోత్సవ కవాతు కళ్లకు కట్టింది. మన దళాలు నిజంగా మన గర్వకారణం!

"నేడు కర్తవ్య పథ్‌లో దేశ సాంస్కృతిక వైవిధ్యం కనువిందు చేసింది. గణతంత్ర దినోత్సవ కవాతులోని ఉత్సాహభరితమైన ప్రదర్శనలు, శకటాల ద్వారా భారతీయ సాంస్కృతిక వైవిధ్యాన్ని వేడుకలా జరుపుకుంది".

# ప్రవాసులు భారతదేశానికి నిజమైన రాయబారులు

## – కువైట్‌లో భారత రాయబారి పరమిత త్రిపాఠి

హైదరాబాద్, జనవరి 27:కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం ఎంబసీ ప్రాంగణంలో 77వ భారత గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంది. కువైట్‌లో భారతదేశపు తొలి మహిళా రాయబారి అయిన పరమిత త్రిపాఠి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. మహాత్మా గాంధీతోపాటు అమరవీరులైన సైనికులకు పుష్పగుచ్ఛాలు సమర్పించి.. నివాళులు అర్పించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి జాతినుద్దేశించి చేసిన ప్రసంగాన్ని ఆమె చదివి వినిపించారు.

ఈ కార్యక్రమానికి పరమిత త్రిపాఠి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కువైట్‌లో ఇది నా మొదటి గణతంత్ర దినోత్సవం, వీా అందరి మధ్య త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నాకు గౌరవంగా ఉందన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి తనకు లభించిన ఆప్యాయతకు సమాజానికి ధన్యవాదాలు పరమిత త్రిపాఠి తెలిపారు. ఈ నియామకం మహిళా నాయకత్వం, సాధికారత పట్ల భారతదేశం పెరుగుతున్న నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు.

రాయబారి పరమిత త్రిపాఠి తన వ్యాఖ్యలను ముగిస్తూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లుగా విదేశాలలో ఉన్న భారతీయ ప్రవాసులు భారతదేశానికి నిజమైన రాయబారులు అని సమాజ సభ్యులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారందరికి ఆమె గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోవడానికి కువైట్‌లోని భారతీయ పౌరులు, భారతదేశ స్నేహితులు, సమాజ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా భారతదేశ గొప్ప కళా సంప్రదాయాలను అందంగా ప్రదర్శించిన మనోహరమైన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

## జోగినపల్లి సంతోష్ కుమార్‌పై సిట్ దర్యాప్తును తీవ్రంగా ఖండిస్తున్నాం : శ్యాం ఆకుల

హైదరాబాద్, జనవరి 27: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్‌పై సిట్ దర్యాప్తును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది ముమ్మాటికీ రాజకీయ ప్రతీకార చర్య అని డెన్మార్క్ బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ అధ్యక్షుడు శ్యాం ఆకుల అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాల పాలనతో పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ విపక్ష నాయకులను వేధించడమే పనిగా పెట్టుకోవడం దుర్మార్గం అన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ కేసులో ఏమీ లేదని సుప్రీం కోర్టు చెప్పినా కాంగ్రెస్ నాటకాలు ఆడుతోందన్నారు. ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైందని, విపక్షాన్ని అణచివేయాలనే దురుద్దేశంతో చేస్తున్న చర్యగా అభివర్ణించారు. జోగినపల్లి సంతోష్ కుమార్‌కు ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన నాయకుడు అని కొనియాడారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తి లేదని, మేమంతా సంతోష్ కుమార్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..

## – నిజామాబాద్ జిల్లా ఆరోగ్య వైద్యాధికారిణి రాజశ్రీ



నిజామాబాద్, జనవరి 27: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ( రోగులకు) అందుబాటులో ఉండి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ రాజశ్రీ అన్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మందుల స్టాక్ నిల్వలను పరిశీలించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, డాక్టర్ సుప్రియను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలో భర్తీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతీ మహిళ ఆరోగ్యం కోసం ప్రతీ మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్లు నర్సులు అందుబాటు లో ఉండి నాణ్యమైన వైద్య సేవాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డాక్టర్ సుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

## పాల్వంచ నుండి మేడారానికి ఆర్టీసీ బస్సులు ప్రారంభం

పాల్వంచ, జనవరి 27 : మేడారం జాతర సందర్భంగా పాల్వంచ బస్టాండ్ నుండి మేడారం వరకు వెళ్లు ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ మంగళ వారం ప్రారంభించారు. పాల్వంచ నుండి మేడారం 150 కిలో మీటర్ల దూరానికి పెద్దలకు రూ. 310, పిల్లలకు రూ.170 టికెట్ ఛార్జి. మహిళలు తమ ఆధార్ కార్డు చూపించి ఉచితంగా ప్రయాణించ వచ్చని తెలిపారు. మేడారం వెళ్లే భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగ చేసుకోవాలని భద్రాచలం డిపో మేనేజర్ జంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర డిపో మేనేజర్ రామయ్య, కొత్తగూడెం డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, చీఫ్ ఇన్‌స్పెక్టర్ విజయ శ్రీ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంకుమార్, సామాజిక సేవా కార్యకర్త యడ్లపల్లి శ్రీనివాసరావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ విశాల ప్రయోజనాల కోసం భారత, ఈయూ రక్షణ పరిశ్రమలు తమ ప్రయత్నాల్లో సమన్వయాన్ని ఏర్పరుచుకోవాలి: శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, జనవరి 27:యూరోపియన్ యూనియన్ (ఈయూ) కమిషన్ ఉన్నత ప్రతినిధి/ఉపాధ్యక్షురాలు కాజా కల్లాస్‌తో కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ న్యూ ఢిల్లీలో ఈ రోజు సమావేశమయ్యారు. ద్వైపాక్షిక భద్రతకు, రక్షణకు సంబంధించిన అనేక అంశాలపై ఈ సమావేశంలో నేతలు ఇద్దరూ చర్చించారు. ప్రజాస్వామ్యం, బహుళవాదం, చట్టబద్ధ పాలనకు సంబంధించి ఉమ్మడి సిద్ధాంతా లను భారత్, ఈయూ అనుసరిస్తున్నాయని, ఇవి క్రమ క్రమంగా ఒక గాఢ భాగస్వామ్యానికి పునాదిని వేస్తాయని రక్షణ మంత్రి తెలిపారు. ఈ విలువల ఆధారంగా ప్రపంచ స్థిరత, సుస్థిర అభివృద్ధి, సమ్మిళిత సమృద్ధి లక్ష్యాల సాధన దిశగా ఆచరణాత్మక సహకారంతో ముందుకు సాగాలని భారత్ ప్రయత్నిస్తోందని కూడా ఆయన వివరించారు.

భారత్, ఈయూ రక్షణ రంగాలకు చెందిన పరిశ్రమలు ప్రపంచ విశాల హితాన్ని దృష్టిలో పెట్టుకొని తమ ప్రయత్నాల్లో సమన్వయాన్ని ఏర్పరుచుకోవాలని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఇది వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి సాధన కోసం ఈయూ చేస్తున్న కృషికి కూడా అనుగుణంగా ఉందనీ, అంతేకాక భారత 'ఆత్మనిర్భర్ భారత్' దృష్టికోణాన్ని సమర్థిస్తోందని ఆయన అన్నారు. సరఫరా వ్యవస్థలను ఏకీకరించి విశ్వసనీయ రక్షణ ప్రధాన అనుబంధ విస్తారిత వ్యవస్థల్నీ, భవిష్యత్తుకు అనువైన విధంగా తయారీ సామర్థ్యాల్నీ మెరుగుపరుచుకోవడంలో ఓ ప్రధాన శక్తిగా ఈ భాగస్వామ్యం మారగలుగుతుందని ఆయన చెప్పారు. ఈయూ చేపట్టిన 'రీ ఆర్మ్ ఇనీషియేటివ్'లో భారత రక్షణ పరిశ్రమ ఒక కీలక పాత్రను పోషిస్తుందనీ, ప్రత్యేకించి ప్రస్తుతం ఈయూ తన సరఫరాదారులలో త్వరిత గతిన మార్పు చేర్పులను చేసుకోవడంతో పాటు ఆధారపడక తప్పని స్థితితో ఎదురయ్యే ముప్పుల్ని తగ్గించుకోవాలని కూడా ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కల్లాస్ భారత్‌లో పర్యటించడం ఎంతో ప్రత్యేకమని ఆయన అన్నారు.

భారత 77వ గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొంటుండడం, విశేషించి కర్తవ్య పథ్‌లో నిర్వహించిన కవాతులో పాలుపంచుకోవడానికి ఈయూకు అవకాశం లభించడం పట్ల కాజా కల్లాస్ కృతజ్ఞత తెలిపారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్, ఈయూ తప్పక కలిసి పనిచేయాలని, సంయుక్త విన్యాసాల ద్వారా పరస్పర అత్యుత్తమ పద్ధతుల్లోని మంచిని గ్రహించాలని ఆమె అన్నారు. గురుగ్రామ్‌లోని భారతీయ నౌకాదళ ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్-ఇండియన్ ఓషన్ రీజియన్ (ఐఎఫ్‌సీ-ఐఓఆర్)లో ఒక అనుసంధాయక అధికారి (ఎల్‌ఓ)ను నియమించాలన్న ఈయూ ప్రతిపాదనను రక్షణ మంత్రి స్వాగతించారు. ఐఎఫ్‌సి-ఐఓఆర్‌లో యూరోపియన్ యూనియన్ లైజాన్ ఆఫీసరును నియమించడం హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్రపు దోపిడీ దొంగలను ఎదుర్కోవడంతో పాటు ఇతరత్రా ముప్పులను పసిగట్టడంలో భారతీయ నౌకాదళంతో కలిసి కార్యకలాపాల పరంగా సమన్వయాన్ని పెంపొందించుకోవడంలో కూడా తోడ్పాటు లభిస్తుంది.

# చదువుతోనే అభివృద్ధి

**-మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**-సకల సదుపాయాలతో బొట్టుగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రారంభం**

**- ప్రపంచస్థాయి పోటీ తట్టుకునేలా విద్యావిధానం**



నల్లగొండ, జనవరి 27 : చదువుతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలో అధునాతన సౌకర్యాలతో ప్రతీక్ ఫౌండేషన్ నిధులతో నిర్మించిన బొట్టుగూడ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నల్లగొండ ప్రజలు తన ప్రాణమని.. సాధారణ రైతు బిడ్డగా వస్తే అక్కున చేర్చుకుని రాష్ట్రంలోనే పెద్ద నాయకుడిని చేసినట్లు చెప్పారు. 5 సార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా, సీనియర్ మంత్రిగా అన్ని పదవులు నల్లగొండ ప్రజలు పెట్టిన బిక్షే అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ధైర్యంగా తన వెన్నంటి ఉన్నారని, ఇక్కడి ప్రజల కోసం ఎంత చేసినా తక్కువే అన్నారు. బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల తన చిరకాల కోరికర అని తెలిపారు. 2,500 గజాల స్థలంలో అన్ని హంగులతో, డిజిటల్ విద్యా విధానం, వరల్డ్‌ఆఫ్ విద్యా విధానంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించనున్నట్లు వెల్లడించారు. పేదవాడు చదువుకోవాలి. చదువుతోనే అభివృద్ధి సాధ్యం అన్నారు.

బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల రొటీన్ పాఠశాల కాదని ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనే విధంగా ఇక్కడ విద్యా విధానం ఉంటుందని తెలిపారు. పాత సిలబస్ తో పాటు, సీబీఎస్‌ఈ సిలబస్ తేనున్నట్లు, సాంప్రదాయ విద్యా విధానం కాకుండా అన్ని రకాల పోటీలు ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. అనుభవాత్మక విద్యను అందించనున్నట్లు, విద్యతో పాటు ప్రకృతి అనుసంధానంతో ప్రకృతి వ్యవసాయం, మట్టికుండల తయారీ, కంప్యూటర్, ఏఐ, ఇలా అన్ని రకాల నైపుణ్యాల అభివృద్ధికి, విద్యార్థుల సృజనాత్మకతను పెంచేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. బొట్టుగూడ పాఠశాలలో ఇండోర్ గేమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, యోగా సెంటర్, డిజిటల్ తరగతులతో పాటు, ప్రతి తరగతి గదిలో ఏసీ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పాఠశాలలో 45 కంప్యూటర్లు ఉన్నాయని, దేశంలోనే ఇలాంటి ప్రభుత్వ పాఠశాల ఉండదన్నారు. ఆణిముత్యాల లాంటి విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్, సైంటిస్టులుగా తయారు చేయనున్నట్లు చెప్పారు. పేదవాడి చదువు కోసం అందరూ కృషి చేయాలని కోరారు. బొట్టుగూడ పాఠశాలకు ప్రవేశాలను బట్టి అవసరమైతే అదనపు భవనాలను కట్టిస్తామని తెలిపారు. నల్లగొండ అభివృద్ధి కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు, విద్య, మంచి వైద్యం తన మొదటి ప్రాధాన్యతగా వెల్లడించారు. ఎవరూ అడగకపోయినా ముఖ్యమంత్రిని ఒప్పించి నల్లగొండను కార్పొరేషన్‌గా చేసినట్లు, త్వరలోనే కొత్త మేయర్, కార్పొరేటర్లు రాబోతున్నారన్నారు. అలాగే తన గుండె వంటి ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులను పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు తాగు, సాగునీరు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, లైబ్రరీ చైర్మన్ ఆఫీజ్ ఖాన్, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# యువత కోసం యువ మండల్ వికాస్ అభియాన్.. పెద్దపల్లి జిల్లా యువజన సంక్షేమ అధికారి రాంబాబు

కరీంనగర్, జనవరి 27: యువత కోసం యువ మండల్ వికాస్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ అధికారి రాంబాబు అన్నారు. గ్రామీణ యువతను ఏకం చేసి వారిని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా పెద్దపల్లి జిల్లా మై భారత్, పత్తిపాక యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఐదు రోజులలో 50 గ్రామాల్లో నిర్వహించారు.

ఈ క్రమంలో మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో యువజన నాయకులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీవైవో వెంకట రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న యువజన సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటి వరకు యువజన సంఘాలు లేని ప్రాంతాల్లో నూతన సంఘాలను ఏర్పాటు చేసి, వారిని మై భారత్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా విభాగాలకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

దీనివల్ల భవిష్యత్తులో మై భారత్ నిర్వహించే ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో గ్రామీణ యువత చురుగ్గా పాల్గొనే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆర్గనైజర్ రేషవేణి మహేష్, యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రేషవేణి సిద్ధార్థ, ఉపాధ్యక్షులు రాహుల్, కార్యదర్శి సోను యూత్ సభ్యులు రిషి ,ఆదర్శ్, రాకేష్, ఇర్ఫాన్, నితిన్ యువజన సంఘాల నాయకులు ధీరజ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలి.. -కోటగిరి ఎస్సై సునీల్

నిజామాబాద్, జనవరి 27:వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాన్ని కాపాడుకోవచ్చని కోటగిరి ఎస్సై సునీల్ అన్నారు. అలైవ్-అరైవ్ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం లింగాపూర్ గ్రామంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు గన్నారం ఎక్స్ రోడ్ నుండి లింగాపూర్ గ్రామం వరకు బైకులపై హెల్మెట్ ధరించి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్సై సునీల్ మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపొద్దని సూచించారు. ముఖ్యంగా వాహనాలను అతివేగంగా నడపవద్దని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురికి హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు శారద రాజేశ్వరి పటేల్, దేగం హనుమంతు, యువకులు పాల్గొన్నారు.

# యువత సామాజిక భాధ్యత తీసుకోవాలి.. హుజూరాబాద్ ఏసీపీ వీ మాధవి

కరీంనగర్, జనవరి 27: యువత సామాజిక బాధ్యత తీసుకోవాలని, సమాజానికి సహకారం అందించాలని హుజూరాబాద్ ఏసీపీ వీమాధవి అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని శాలపల్లి- ఇందిరానగర్ గ్రామంలో జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఏడు రోజుల ప్రత్యేక శిబిరం మంగళవారం ముగిసింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత శ్రమదానం, రక్తదానం చేయాలని సూచించారు. రక్త దానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. సమాజానికి ఉపయోగ పడే సేవలు చేయాలని, తల్లిదండ్రుల క్షేమాన్ని బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుతే ప్రభుత్వ, ప్రవేటు రంగాలలో చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు పోలీసు శాఖలోకి రావాలని, పోలీసు ఉద్యోగం చేయడం వల్ల తమకు తమ రక్షణతో పాటు ఇతరులకు రక్షణ ఇచ్చినవారమవుతామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోడిగూటి కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎంబాడి రవి, లోఖండే రవీందర్, అధ్యాపకులు డాక్టర్ గణేష్, డాక్టర్ రాజేంద్రం, డాక్టర్ మాధవి, డాక్టర్ శ్యామల, రాజకుమార్, వీ శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ కుమార్, డాక్టర్ సుష్మ, డాక్టర్ రవి ప్రకాష్ రావు, సాయి కుమార్, అరుణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ డీ తిరుపతి, వార్డు సభ్యులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది సకాలంలో హాజరు కావాలి.. నిజామాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్, జనవరి 27: వైద్య సిబ్బంది తప్పనిసరిగా సకాలంలో విధులకు హాజరుకావాలని డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ సిబ్బందిని ఆదేశించారు. పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని మందులు, పలు రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రి పరిధిలో గర్భిణుల వివరాల నమోదు, ఓపీ తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

# గ్రామాల అభివృద్ధిలో ఉప సర్పంచుల పాత్ర కీలకం : కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



నల్గొండ, జనవరి 27: గ్రామాల అభివృద్ధిలో ఉప సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గిరిజన ఉప సర్పంచుల సంఘం 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రజా ప్రతినిధులు ముందుండాలన్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. గిరిజన తండాల్లో ఉప సర్పంచుల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉప సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ సురేష్ నాయక్, మున్యా నాయక్ తండా సర్పంచ్ సుశీల సాగర్ నాయక్, ఐలాపురం గ్రామ ఉప సర్పంచ్ అనిల్ నాయక్, బానోత్ నాగు నాయక్, జిల్లావ్యాప్త ఉప సర్పంచులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు మేడారం జాతర శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్



హైదరాబాద్, జనవరి 27:మేడారం సమ్మక్క సారలమ్మ ప్రధాన జాతరకు సర్వం సిద్ధమైంది. రేపటి (జనవరి 28) నుంచి ఈ నెల 31 వరకు కన్నుల పండువలా జాతర సాగనుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలందరికీ మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ త్యాగానికి, ధిక్కారానికి ఆదివాసీ దేవతలైన సమ్మక్క, సారలమ్మలు ప్రతీకలని కేసీఆర్ చెప్పారు. కొంగు బంగారమై కోరిన కోరికలు తీర్చే తమ ఇలవేల్పులకు మొక్కులు తీర్చుకునేందుకు కోట్లాదిగా తరలివచ్చే భక్తులతో.. మేడారం జాతర కుంభమేళాను తలపిస్తూ ఆధ్యాత్మిక కేంద్రమై కొనసాగుతున్నదని బీఆర్ఎస్ అధినేత పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో ప్రగతి మళ్లీ పుంజుకొని, తెలంగాణ ప్రజలు సుభిక్షంగా జీవించేలా దీవించాలని సమ్మక్క సారలమ్మ దేవతలను కేసీఆర్ ప్రార్థించారు.

# డంపింగ్ యార్డ్ ఎత్తేయాలని ఎర్రగుంట, జగ్గుతండా గ్రామస్తుల ఆందోళన

ఖమ్మం, జనవరి 27: కొత్తగూడెం కార్పొరేషన్‌లోని పాల్వంచ పట్టణంలోని చెత్తను ఎర్రగుంట, జగ్గు తండా ప్రాంత సరిహద్దుల్లో వేయడాన్ని నిరసిస్తూ రెండు గ్రామాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి మంగళవారం మున్సిపాలిటీ చెత్త సేకరించే వాహనాలు అడ్డుకున్నారు. అనంతరం జగ్గు తండాలోని బైపాస్ రోడ్డులో చెత్త వాహనాలు రాకుండా రోడ్డుమీద బైఠాయించి నిరసన తెలిపారు. డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలని కోరుతూ గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో మంగళవారం రోడ్డుపై బైఠాయించి చెత్త సేకరించే వాహనాలు అడ్డుకున్నారు. గ్రామం పక్కనే డంపింగ్ యార్డ్ పెట్టి అందులోని చెత్తకు నిప్పు పెట్టడం వల్ల వచ్చే విషపూరిత పొగతో చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నట్లు తెలిపారు. గ్రామం చుట్టూ చెత్త కుప్పలుగా పేరుకుపోవడంతో తీవ్రమైన దుర్వాసన వస్తోందన్నారు. మూడు రోజులుగా ధర్నా చేస్తున్నా అటు అధికారులు గానీ, ఇటు స్థానిక ఎమ్మెల్యే గానీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామం వద్ద చెత్త వేయడం వెంటనే నిలిపివేయాలని, సమస్య పరిష్కారం అయ్యే వరకు వాహనాలను వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

# గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నాడో ఆ పార్టీ కండువా కప్పుకొని ఎన్నికల్లో తిరగాలి : ఎంపీ డీకే అరుణ



మహబూబ్‌నగర్, జనవరి 27: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకోవాలని మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. గద్వాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిపై మండిపడ్డారు.

గద్వాల పట్టణంలో ఎవరికి ఓటు అడిగే హక్కు లేదని, ఎవరు ఏమి అభివృద్ధి చేశారో పట్టణ ప్రజలకు తెలుసని అన్నారు. తెలంగాణ స్పీకర్ ఇచ్చిన తీర్పు ప్రకారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నాడో ఆ పార్టీ కండువా కప్పుకుని ఎన్నికల్లో తిరగాలని ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు.

స్పీకర్ నిర్ణయాన్ని ఎమ్మెల్యే బండ్ల గౌరవించాలన్నారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యే బండ్ల ఇప్పుడున్నది కాంగ్రెస్ పార్టీలోనని గద్వాల ప్రజలందరికీ తెలుసు. తాను కాంగ్రెస్‌లో ఉన్నా అని చెబితే.. కాంగ్రెస్ కండువా వేసుకొని తిరిగితే ఎమ్మెల్యే పదవి ఊడిపోతదని ఎమ్మెల్యే బండ్ల ఏదో అబద్దాలు చెప్పుకుంటూ తిరుగుతున్నరన్నారు. ఆయన ఏ మొహం పెట్టుకుని మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం చేస్తారన్నారని ప్రశ్నించారు.

ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ పాట పాడటం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికే సొంతమని డీకే అరుణ అన్నారు. గద్వాల పట్టణ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని, పట్టణ ప్రజలు గద్వాల అభివృద్ధి కావాలంటే బీజేపీకి పట్టం కట్టాలని డీకే అరుణ కోరారు.

# భార్య చికిత్స కోసం.. రిక్షా తొక్కుతూ 300 కి.మీ ప్రయాణం

**- ఒడిశాకు చెందిన 75 ఏండ్ల వృద్ధుడి సాహసం**

సంబల్‌పూర్ జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : సంకల్ప బలం ఉండాలే కాని.. ఎన్ని కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా ఆ పనిని విజయవంతంగా పూర్తి చేయవచ్చునని నిరూపించాడో 75 ఏండ్ల వృద్ధుడు. ఒడిశా రాష్ట్రం సంబల్‌పూర్‌లోని మొడిపడలో నివసించే బాబు లోహార్ పక్షవాతంతో బాధపడుతున్న భార్యను స్థానిక డాక్టర్ల సలహా మేరకు కటక్‌లోని ఎస్‌సీబీ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో చికిత్స అందించేందుకు నిర్ణయించుకున్నాడు. అయితే ఆమెను అంత దూరం అంబులెన్స్‌లో తీసుకుపోయే ఆర్థిక శక్తి లేకపోవడంతో తన రిక్షానే అంబులెన్స్‌గా మార్చాడు. దానిలో ఆమెను ఎక్కించుకుని 300 కి.మీ దూరంలోని కటక్‌కు బయలుదేరాడు. భార్య జ్యోతిని దవాఖానలో చేర్చి రెండు నెలలు చికిత్స అందించి సంబల్‌పూర్‌కు బయలుదేరారు. అయితే దారిలో ఈ నెల 19న చౌద్వార్ వద్ద వారి రిక్షాను ఒక వాహనం ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. భార్యకు తీవ్రంగా గాయాలయ్యాయి.

# టీవీ ఛానెల్ డిబేట్‌లో తనకు జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలి

## -శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ ఫిర్యాదు



హైదరాబాద్ జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: టీవీ ఛానెల్ డిబేట్‌లో తనకు జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అయిన సిరికొండ మధుసూధనాచారి నేతృత్వంలో.. ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఛైర్మన్ కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ తన ఫిర్యాదును ఛైర్మన్‌కు అందజేశారు. ఏబీఎన్ డిబేట్‌లో తనకు జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. ఇటీవల ఏబీఎన్‌లో జరిగిన ఓ డిబేట్ సందర్భంగా రవీందర్ రావును గెట్అవుట్ అంటూ అవమానించారు. దీనిపై ఆయన ఫిర్యాదు చేశారు. తక్కళ్లపల్లి రవీందర్ రావుతోపాటు వెళ్లి మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నేతల్లో దేశపతి శ్రీనివాస్, మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, నవీన్‌రెడ్డి ఉన్నారు.

# ఎస్‌హెచ్‌జి మహిళలకు నైపుణ్యాభివృద్ధి..

**-ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్న కేశినేని ఫౌండేషన్**

**-హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి లో 5 రోజుల శిక్షణకు 50 మంది మహిళల బృందం..**

**-బస్సుకు జెండా ఊపి ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్**

ఇబ్రహీంపట్నం, జనవరి 27: మహిళల సాధికారత, ఆర్థిక స్వాలంబన లక్ష్యంగా ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జి మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తెలిపారు. కేశినేని ఫౌండేషన్, హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నుంచి 50 మంది ఎస్‌హెచ్‌జి మహిళలు హైదరాబాద్‌కు బయలుదేరారు.

ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ బస్సును జెండా ఊపి ప్రారంభించారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి ప్రధాన కార్యాలయంలో ఐదు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ఈ శిక్షణలో జ్యూట్ అండ్ కాటన్ బ్యాగ్స్ తయారీ, హెర్బల్ ఉత్పత్తుల తయారీ విధానాలపై మహిళలకు ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించనున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రతి ఇంటి నుంచి మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే కేశినేని ఫౌండేషన్ లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధి అని పేర్కొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, కేశినేని ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొస్తున్నాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ అక్కల గాంధీ, ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి రూరల్ కో-ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మ, అర్బన్ కో-ఆర్డినేటర్ వల్లభనేని నరసింహాచౌదరి, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపురం ఆలయానికి రూ.56.25 లక్షలు మంజూరు

## -మంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపిన తిమ్మాపురం గ్రామస్తులు, నాయకులు

అమరావతి, జనవరి 27:రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో యద్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాచీన శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం రూపురేఖలు మారనున్నాయి. గ్రామస్తులు గతంలో మంత్రి లోకేష్ దృష్టికి ఆలయ అభివృద్ధి అంశం తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయాలని దేవాదాయ శాఖ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీంతో తిమ్మాపురంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ముఖమండపం, ఆలయ అభివృద్ధి పనులు కోసం దేవాదాయ శాఖ మొత్తం అంచనా వ్యయం 62 లక్షల 50 వేల రూపాయలు కాగా, మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ 6,25,000, సిజిఎఫ్ నుంచి 56 లక్షల 25వేల రూపాయలు మంజూరు చేయడమైనది.

దేవాలయం అభివృద్ధి కోసం అడిగిన వెంటనే దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేయించడం పట్ల గ్రామస్తులు మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక ఆలోచనలను గౌరవిస్తూ, దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించడం అభినందనీయమని, ఈ నిధులతో దేవాలయాన్ని మరింత అభివృద్ధి పరిచి, భక్తులకు, గ్రామ ప్రజలకు అవసరమైన మరింత సౌకర్యాలు కల్పించే అవకాశం కలుగుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ గ్రామ అభివృద్ధికి నిరంతరం తోడ్పాటును అందిస్తున్నమంత్రి నారా లోకేష్‌కు రుణపడి ఉంటామన్నారు.

# సిక్కోలు బృందానికి డిల్లీలో సన్మానం

## -రిపబ్లిక్ డే వేడుకల్లో భరతనాట్యంతో అలరించిన శ్రీకాంత్ బృందం.

## -సిక్కోలు కీర్తి చాటేలా మంచి ప్రదర్శన.. కేంద్ర మంత్రి కితాబు .



శ్రీకాకుళం, జనవరి 27: దేశ రాజధాని డిల్లీలోని కర్తవ్యపద్ లో నిన్న జరిగిన 77వ రిపబ్లిక్ డే వేడుకలల్లో సాంస్కృతిక ప్రదర్శన చేసిన శ్రీకాకుళానికి చెందిన రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం మంగళవారం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తో భేటి అయ్యారు. డిల్లి అక్బర్ రోడ్డులోని తన నివాసానికి విచ్చేసిన ఈ సిక్కోలు బృందానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆత్మీయ స్వాగతం పలికారు. రిపబ్లిక్ డే వేడుకలలో శ్రీకాకుళం కీర్తి చాటేలా మంచి ప్రదర్శన ఇచ్చారని కేంద్రమంత్రి కితాబిచ్చారు. తన తరపున పూర్తి ప్రోత్సాహం ఉంటుందని.. భవిష్యత్ లో జాతీయం, అంతర్జాతీయ స్థాయిలలో మరిన్ని వేదికలపై మంచి ప్రదర్శనలు ఇవ్వాలని ఆకాంక్షించారు. రిప్లబిక్ డే వేడుకల లాంటి ఉన్నతమైన వేదికలో తమ ప్రదర్శనకు అవకాశం లభించేలా పూర్తి తోడ్పాటు అందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు.. నృత్య శిక్షకుడు రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

## -రక్తదానమునకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలి



విశాఖపట్నం జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతీ ఒక్కరూ రక్తదానమునకు ముందుకు రావాలని విశాఖ ద్వారక నగర్ లోని ఎంఎస్ఎంఈ ఫోకస్డ్ ఎన్‌బీఎఫ్‌సీ 'సారథి ఫైనాన్స్' ఆధ్వర్యంలో రక్తదానముకు పిలుపునిచ్చారు. సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలపై దృష్టి సారించే నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ 'సారథి ఫైనాన్స్' ఆధ్వర్యంలో విశాఖపట్నంలో సామాజిక బాధ్యతతో కూడిన రక్తదాన శిబిరం నిర్వహించబడింది. సంస్థ చేపట్టిన దేశవ్యాప్త సామాజిక కార్యక్రమాలలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరానికి రక్తదానం చేసేందుకు చాలా మంది దాతలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఒకరి రక్తదానం ద్వారా 6 గురి వ్యక్తులను ప్రాణాపాయం నుండి కాపాడవచ్చున్నారు. రక్తం నుండి ప్లాస్మా, ప్లేట్ లెట్లు, ఎర్ర,తెల్ల రక్త కణాలు వంటి కంపోనెంట్లు అందించవచ్చున్నారు. దాదాపు 10 లీటర్ల రక్తాన్ని సేకరించి, స్థానిక ఆసుపత్రుల అవసరాల కోసం మరియు రక్త నిల్వల కొరతను తీర్చడానికి అందజేశారు. స్థానిక ఆరోగ్య వ్యవస్థలకు మద్దతుగా సారథి ఫైనాన్స్ దేశవ్యాప్తంగా ఆరు వేర్వేరు నగరాల్లో ఇటువంటి డ్రైవ్‌లను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగు లు, కస్టమర్లు, భాగస్వాములు మరియు స్థానిక నివాసితులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సారథి ఫైనాన్స్ ప్రధానంగా ఎంఎస్ ఎంఈల జీవనోపాధిని, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నప్పటికీ, ఈ చొరవ ద్వారా ఆర్థిక సేవలకు అతీతంగా సమాజ శ్రేయస్సు పట్ల తమకున్న అంకితభావాన్ని చాటుకుంది. స్థానిక ప్రజల నుండి లభించిన స్పందన పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. తక్షణ మరియు ప్రత్యక్ష ప్రభావం చూపే ఇటువంటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రజలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని ఈ శిబిరం నిరూపించింది. తమ ఎంఎస్ఎంఈ నెట్‌వర్క్‌తో పాటు, ఇటువంటి సామాజిక బాధ్యతాయుతమైన పనుల ద్వారా పటిష్టమైన స్థానిక సమాజాల నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని సారథి ఫైనాన్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

# కొండపల్లిలో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

## -మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

## -ఎంపీ, అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల పరిశీలన.



ఇబ్రహీంపట్నం, జనవరి 27: నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అతి సమీపంలో ఉన్న కొండపల్లి, ఇబ్రహీంపట్నం ఏరియాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేసున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), పర్యాటక, అటవీ, పురావస్తు శాఖల అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడులో అటవీశాఖ నగరవనాన్ని, పురావస్తు శాఖ పరిధిలోని కొండపల్లి ఖిల్లాను, ఇబ్రహీంపట్నంలో కృష్ణా గోదావరి నదుల కలయిక అయిన పవిత్ర సంగమం ప్రాంతాన్ని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మంగళవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ అటవీ పర్యాటకానికి ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఎక్కువ మందిని ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు.

విజయవాడ నగరానికి, రాజధాని అమరావతికి దగ్గరగా ఉండడంతో దీని అభివృద్ధి కీలకంగా మారిందన్నారు. పశ్చిమ బైపాస్ అందుబాటులోకి రావడంతో అమరావతి నుంచి కూడా ఎక్కువ మంది సందర్శించే అవకాశం ఉందన్నారు. మూలపాడు నుంచి అమరావతికి ఐకానిక్ వంతెన నిర్మాణంతో దీనికి మరింత ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. బటర్ ఫ్లై పార్కులో పచ్చని చెట్ల నడుమ, పక్షుల సంచారంతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జిప్ లైన్, ట్రెక్కింగ్ తో ప్రజలు ఇక్కడికి వచ్చి మంచి అనుభూతిని పొందుతున్నారని అన్నారు. అలాగే పిల్లలు ఆడుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారన్నారు.

త్వరలోనే జంగిల్ సఫారీ, బర్డ్ వరల్డ్, మరిన్ని ట్రెక్కింగ్ పాయింట్స్ అందుబాటులోకి రానున్నాయన్నారు. ఇక్కడ దాదాపు 300 హెక్టార్లలో అటవీశాఖ భూమి ఉందన్నారు. ఇందులో జూ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు వెల్లడించారు. కొండపల్లి ఖిల్లాపై ఉన్న కోటలో చారిత్రక విశేషాలు మాత్రం ఇప్పటికీ పదిలంగా ఉన్నాయన్నారు. అలనాటి ప్రాభవం కళ్లముందు కదలాడుతూనే ఉందన్నారు. తెలుగునాట పేరొందిన చారిత్రక పర్యాటక ప్రాంతాల్లో కొండపల్లి కోట ముందువరుసలో ఉంటుందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో కొండపల్లి ఖిల్లా పూర్తిగా శిథిలావస్థకు చేరగా కూటమి ప్రభుత్వ హయాంలో సంవత్సరానికి పైగా శ్రమించి కొండపల్లి కోటకు మరమ్మతులు చేసి మళ్లీ ప్రాణం పోశారన్నారు.

హైదరాబాద్ గోల్కొండ తరహాలో కోట గోడలపై లేజర్ షో, త్రీడీ ప్రొజెక్షన్ మ్యాపింగ్‌ను పునరుద్ధరణ చేసున్నట్లు పేర్కొన్నారు. రవాణా సదుపాయాలు, మౌలిక వసతులు అభివృద్ధి చేస్తే పర్యాటకంగా కొండపల్లి మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఆదిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కొండపల్లి నుంచి కాలిబాట అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేస్తామన్నారు. కృష్ణ, గోదావరి నదులు సంగమించే ఇబ్రహీంపట్నంలోని ఫెర్రీ ఎగువ ప్రాంతమైన 'పవిత్ర సంగమం'ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. గత కృష్ణా పుష్కరాలను పురస్కరించుకుని ఇక్కడ రివర్ ఫ్రంట్ ఘాట్లను నిర్మించారన్నారు. అప్పట్లో ఇక్కడ కృష్ణా హారతులు చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చేవారన్నారు.

పర్యాటకుల కోసం బోటింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతి విధ్వంసంతో పాటే పవిత్ర సంగమాన్ని కూడా నిర్వీర్యం చేశారన్నారు. దీనికి కూడా పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధికి విజన్ 2047 డాక్యుమెంట్లో కూడా ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఈ విషయాలు అన్నింటినీ సీఎం చంద్రబాబు గారి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి అయిన సందర్భంగా కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), మైలవరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి నూతలపాటి బాలకోటేశ్వరరావు (బాల), వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# అమెజాన్‌లో భారీ లేఆఫ్స్.. 16,000 మందిని తొలగించేందుకు రంగం సిద్ధం

హైదరాబాద్ జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థల్లో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే వేల సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించిన అమెజాన్.. ఇప్పుడు మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోందని సమాచారం. నేటి నుంచే ఉద్యోగుల్ని తొలగించబోతుంది. ఈసారి దాదాపు 16,000 మందిని తీసేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.నేటి నుంచి వారం రోజుల్లోపు ఇందుకు సంబంధించి ఆదేశాలొచ్చే అవకాశం ఉంది. గత ఏడాది చివర్లో అమెజాన్ సంస్థ దాదాపు 14,000 మంది స్టాఫ్‌ను తొలగించింది. ఇప్పుడు మరో 16,000 మందిని తొలగించనుంది. అంటే ఆరు నెలల వ్యవధిలోనే దాదాపు 30,000 మందిని తొలగించినట్లవుతుంది. అంతకుముందు 2023లో 27,000 మందికి ఉద్వాసన పలికింది. ఏఐ, ఆటోమేషన్ కారణంగానే ఉద్యోగుల కోత జరుగుతోందని విశ్లేషకుల అంచనా.ఉద్యోగుల తొలగింపుపై మేనేజర్లు, సీనియర్ లీడర్లకు ఈ మేరకు ఇప్పటికే సమాచారం అందింది. పనితీరు ఆధారంగా కూడా లేఆఫ్స్ జరుగుతున్నాయని అమెజాన్ ఉద్యోగులకు తెలిపింది. అమెజాన్‌లో రిటైల్, వేర్‌హౌజ్ సిబ్బందితోపాటు హై శాలరీ కార్పొరేట్, అడ్మినిస్ట్రేషన్ ఉద్యోగుల్ని కూడా కంపెనీ తొలగిస్తోంది.

# కో-ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్స్‌కు అవకాశం కల్పించాలి

కొల్లాపూర్, జనవరి 27:: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కో-ఆప్షన్ సభ్యులలో ఒకరిని ట్రాన్స్‌జెండర్స్‌కు అవకాశాలు కల్పించాలని నాగర్ కర్నూలు జిల్లా ట్రాన్స్ జెండర్స్ సొసైటీ సభ్యులు మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్ జెండర్స్‌కు సమాజంలో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు చేయాలన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అర్హులైన ట్రాన్స్ జెండర్స్‌కు రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్స్ అసోసియేషన్ నాయకులు శివాని నాయక్, జానకి నాయక్, దీక్షిత్ పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పనులను వినియోగించుకోవాలి : ఎంపీడీవో పీ శ్రీనివాస్



ఆదిలాబాద్, జనవరి 27:మెరుగైన జీవనోపాధి కోసం ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని తాండూర్ ఎంపీడీవో పీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా తాండూరు, రాజీవ్ నగర్ గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఏపీవో నందకుమార్ రెడ్డితో కలిసి సందర్శించారు. కూలీలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఉదయం సమయంలో వచ్చి ఉపాధి హామీ పనులు చేసుకుంటున్నట్లు కూలీలు వివరించారు.

దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ పని ప్రదేశంలో సంబంధిత వేజ్ సీకర్స్ కు తప్పనిసరిగా ఉదయం 7 గంటలకు పని ప్రదేశానికి చేరుకొని, సంబంధిత క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరం మార్చి 31 వరకు ముగుస్తుందని, ఉపాధిహామీ పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో వచ్చి మండల టార్గెట్ పనులు పూర్తి చేయాలన్నారు. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి మండలానికి ఉపాధిహామీ పనులు, నిధులు మరిన్ని ఎక్కువ వచ్చే అవకాశం ఉందన్నారు.

# అందుకే ఒప్పందాన్ని రద్దుచేశాం.. పాకిస్థాన్

## -ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ వైఖరిని మరోసారి ఎండగట్టిన భారత్




న్యూ డిల్లీ జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ వైఖరిని భారత్ మరోసారి ఎండగట్టింది. ఆపరేషన్ సిందూర్ పై ఆ దేశ రాయబారి చేసిన తప్పుడు ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టింది. ఉగ్రవాదాన్ని చట్టబద్ధం చేసేందుకు ఆ దేశం ప్రయత్నిస్తోందని మండిపడింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఘాటుగా స్పందించారు. ఉగ్రవాదాన్ని శిక్షిస్తూ సరికొత్త సాధారణ స్థితి నెలకొల్పినట్లు భారత్ చెబుతున్న పరిస్థితి ఏమీ కనిపించడం లేదని పాక్ రాయబారి ఆసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ విషయం ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో తమ ప్రతిస్పందనతోనే తేలిపోయిందని వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో ఆసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్, జమ్ముకశ్మీర్, సింధూ జలాల ఒప్పందం గురించి ప్రస్తావించారు. దీనిపై ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఘాటుగా స్పందించారు. అంతర్జాతీయ వేదికల్లో పాకిస్థాన్ ప్రతిసారీ భారత్‌కు, దేశ ప్రజలకు హాని కలిగించడమే అజెండాగా పెట్టుకుందని మండిపడ్డారు. ఈ సందర్భంగా పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ గురించి వివరించారు. జమ్ముకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని హరీశ్ పునరుద్ఘాటించారు. భారత అంతర్గత అంశాలపై వ్యాఖ్యానించే హక్కు పాకిస్థాన్‌కు లేదన్నారు. 65 ఏళ్ల క్రితం విశ్వాసం, స్నేహం స్ఫూర్తితో భారత్ సింధూ జలాల ఒప్పందం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అన్నారు. అందుకే భారత్ ఆ ఒప్పందాన్ని నిలిపివేసిందని తెలిపారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన ఔట్ సోర్సింగ్ ఏఈ శ్రీకాంత్

ఆదిలాబాద్, జనవరి 27: లంచం తీసుకుంటూ ఔట్ సోర్సింగ్ ఏఈ శ్రీకాంత్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే..ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని హౌసింగ్ శాఖలో ఔట్ సోర్సింగ్ ఏఈగా పనిచేస్తున్న శ్రీకాంత్ రూ.10,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డారు. నార్నూర్‌లోని ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయడానికి ఏఈ శ్రీకాంత్ లబ్ధిదారుల వద్ద నుంచి రూపాయలు 20,000 డిమాండ్ చేశాడు.

దీంతో లబ్ధిదారులు ఏసీబీని ఆశ్రయించారు. వారి సూచన మేరకు పదివేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకొని లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితున్ని ఏసీబీ కరీంనగర్ కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

# యారన్ సబ్సిడీ విడుదల చేయాలి..

## -బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జనవరి 27: నేటినిజం (ప్రతినిధి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నేతకార్మికులను యజమానులుగా చేసేందుకు రూ.377కోట్లతో ఏర్పాటు చేసిన 50 వర్కర్ టూ ఓనర్ షెడ్లను పంపిణీ చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వివక్ష చూపిస్తున్నదని, కార్మికులకు రావాల్సిన యారన్ సబ్సిడీ విడుదల చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడుస్తున్నా నేత కార్మికుల సంక్షేమానికి కనీసం ఏ ఒక్క పథకం కూడా అమలు చేయలేదని మండిపడ్డారు.



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సంజీవయ్యనగర్ లో ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నేతన్నపై కాంగ్రెస్ సర్కారు చావుదెబ్బ', 'సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను కాపాడుకుందాం' అనే పేరుతో ఏర్పాటు చేసిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భగా విలేకరులతో మాట్లాడుతూ పద్మశాలీల అభ్యున్నతి కోసం రాష్ట్ర బడ్జెట్ లోనే తొలిసారిగా బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 1200కోట్లు కేటాయించిందని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు కోట్లాది మీటర్ల బట్ట ఆర్డర్లను టెస్కో ద్వారా ఇచ్చిందని గుర్తుచేశారు. తద్వారా ప్రతి నేతకార్మికుడికి నెలకు రూ.15 వేల నుండి రూ.20వేల వరకు గౌరవప్రదమైన వేతనం లభించిందని గుర్తుచేశారు.

దేశంలోనే ఎక్కడా లేని విధంగా నేతన్నకు చేయూత (థ్రిఫ్ట్) పథక నుండి 1801 మంది కార్మికులకు రూ.514 కోట్లు, నూలు రాయితీ పథకం ద్వారా 5,374 మందికి రూ. 37.15కోట్లు అందించిందన్నారు. నేత కార్మికుల రుణాలను రద్దు చేస్తూ రూ.370కోట్ల రుణమాఫీ చేసిందని, రైతు బీమా తరహాలో నేతకార్మికుల కోసం నేతన్న బీమా పథకం కింద 5వేల మందికి రూ.5 లక్షల భీమా సౌకర్యం కల్పించిందన్నారు. రూ.30 కోట్లతో వందశాతం సబ్సిడీతో మగ్గాలను ఆధునీకరణ, టెక్స్టైల్ పార్క్ లోని పరిశ్రమ లకు యాభై శాతం విద్యుత్ రాయితీ కింద రూ.24కోట్లు మంజూరు చేసిందన్నారు.పద్మశాలీల సంక్షేమం కోసం 5 ఎకరాల భూమిని కేటాయిస్తూ సంక్షేమ సంఘం భవనానికి రూ.5కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు అవుతున్నా వర్కర్ టూ ఓనర్ షెడ్ల పథకాన్ని అమలు చేయడం లేదని అగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా నేత కార్మికులకు రావాల్సిన యారన్ సబ్సిడీని మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల లో సరైన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు షఫీ, స్థానికులు పాల్గొన్నారు.

# కాంటోన్మెంట్ ఎం.ఎల్. ఏ. గణేష్ రిలే నిరాహార దీక్షకు లోకసత్తా పార్టీ సంఘీభావం




హైదరాబాద్ జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సికింద్రాబాద్ కాంటోన్మెంట్ లో గల పౌర నివాస ప్రాంతాలను గ్రేటర్ హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలీనం చేయాలని స్థానిక ఎం.ఎల్. ఏ. శ్రీగణేష్ చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలియ జేశారు. 7వ రోజున లోకసత్తా పార్టీ రాష్ట అధ్యక్షులు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ పౌర నివాస ప్రాంతంలో నాలుగు లక్షల మంది పౌరులు నానా యాతన పడుతున్నారని ఇక్కడి స్థానిక పౌర సమస్యల పరిష్కారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో కాకుండా కేంద్ర రక్షణ శాఖ పరిధిలో ఉండడంతో మౌలిక వసతుల కల్పన,రోడ్లు, మంచినీరు, డ్రైనేజ్, ఇంటి నిర్మాణానికి అనుమతులు వంటి ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారానికి నోచుకోక పౌరులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం గజెట్ నోటిఫికేషన్ జారీచేసినా రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం లేదని ప్రకటించినా తాత్సారం దేనికని ఆయన సూటిగా ప్రశ్నించారు. విలీన ప్రక్రియ కాంటోన్మెంట్ ప్రజల న్యాయమైన డిమాండ్ మరియు ప్రజాస్వామిక హక్కు అని తుమ్మనపల్లి స్పష్టం చేశారు. ఇంకా ఈ నిరాహార దీక్షలో ఉపాధ్యక్షులు నందిపేట రవీందర్, కార్యదర్శులు మల్లాది కిషోర్, శివరామ కృష్ణ, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి

## -రాధారపు సతీష్ కుమార్

హైదరాబాద్, జనవరి 27: మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఎన్నారై బీఆర్ఎస్ సెల్ బ్రాయిన్ అధ్యక్షుడు రాధారపు సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలకు, 7 నగరపాలక సంస్థలకు ఫిబ్రవరి 11 న ఎన్నికలు జరుగుతున్నా నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థులనుభరి మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఎన్నారైల తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

ఎన్నారై సెల్ ద్వారా ఆయా మున్సిపాల్టీలలో సోషల్ మీడియా, ఫోన్ కాల్స్ ద్వారా బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేయాలని విస్తృత ప్రసారం చేస్తామని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిన ఘనత బీఆర్ఎస్ పార్టీది అని పేర్కొన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు ఎదురు చూస్తున్నారని తెలిపారు.

# సింగరేణిలో అవినీతి వెలికితీశాక పాలకుల్లో వణుకు మొదలైంది

## - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్ జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );'సింగరేణిలో అవినీతి వెలికితీశాక పాలకుల్లో వణుకు మొదలైందని. తెలంగాణ సీఎం కోల్ మాఫియాకు నాయకుడిలా మారిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు బొగ్గు గనుల కేటాయింపులపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఫిర్యాదు చేశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఏ బొగ్గుగనిలో లేని నిబంధన ఇక్కడనే ఎందుకు పెట్టారంటే ఇంతవరకు సమాధానం రాదన్నారు. నిజంగనే 2018 నుంచి 2024 వరకు ఈ నిబంధనను కేంద్రప్రభుత్వం సిఫారసు చేసి ఉంటే.. ఆ రోజున్న బీఆర్ఎస్ ప్రభుత్వం తరపున అన్ని టెండర్లను కూడా మేం పారదర్శకంగా పిలిచినం. అందుకే ఆ రోజు అన్నీ మైనస్ టెండర్లు వచ్చినయ్. ఎస్టిమేటివ్ కంటే తక్కువ ఖర్చుకే సింగరేణికి డబ్బులు ఆదా చేస్తూ ఆ రోజు జరిగిన మాట వాస్తవమా.. కాదా..? అని ప్రశ్నించారు. మరి ఆ రోజు టెండర్లలో లేని షరతు మీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సైట్ విజిట్ సర్టిఫికేషన్ విధానం ఎందుకు పెట్టారు.




ఎవరికి లాభం చేయడానికి పెట్టారు. అంటే ఇంతవరకు ప్రభుత్వంలోని బాధ్యులు ఏ ఒక్కరూ కూడా సమాధానం చెప్పడం లేదన్నారు కేటీఆర్ .2025-26లో నిజానికి జనవరిలో ఈ నిబంధనలు లేకుండా ఒక టెండరు చేశారు. జనవరిలో టెండరు వేస్తారు.. మళ్లీ వెంటనే ఆ టెండరు రద్దు చేశారు. టెండర్లలో ఈ నిబంధన లేకుండా ఆ రోజు మీరు టెండరు పిలిస్తే మైనస్ -7 శాతానికే పనిచేస్తామని (అంటే 100 రూపాయలకు ఎస్టిమేట్ చేస్తే 93 రూపాయలకే పనిచేస్తామని) కాంట్రాక్టు సంస్థలు ముందుకొచ్చాయి. కానీ మీరు దాన్ని రద్దు చేశారు. ఈ నిబంధన పెట్టారు. దాని వల్ల తిరిగి మళ్లీ అదే ప్లేస్‌లో టెండర్ పిలిస్తే +12 (అంటే 100 రూపాయలకు అయ్యే పని 112 రూపాయలు) కావాలని చెప్పి సంస్థలు వచ్చిన మాట వాస్తవమా.. కాదా అని చెప్పాలని ప్రభుత్వాన్ని వేం డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ అన్నారు.

# రాజ్యాంగం ఇచ్చిన ప్రతిఫలాలను సుదీర్ఘకాలం బీసీలు పొందలేకపోయారు

## -తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి



హైద్రాబాద్ జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాజ్యాంగం ఇచ్చిన ప్రతిఫలాలను సుదీర్ఘకాలం బీసీలు పొందలేకపోయారని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి అన్నారు.ఈనెల 29న కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనగణన పై నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంపై తెలంగాణ జాగృతి కార్యాలయం లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశం లో మాట్లాడారు.45 ఏళ్లు పోరాటం చేస్తే మండల్ కమిషన్ వచ్చాక బీసీలకు రిజర్వేషన్లు వచ్చాయి. ఆ తర్వాత అంత పెద్ద స్థాయిలో బీసీల కోసం జరుగుతున్న కార్యక్రమం బీసీ కులగణన. ఎంతో మంది బీసీ నాయకులు విస్తృతంగా ఉద్యమాలు చేస్తే కేంద్రం బీసీ కులగణనకు అంగీకరించింది. కేంద్రం చేపట్టబోయే 33 అంశాల్లో కులగణనన కూడా ఒక అంశంగా ఉందన్నారు. ఐతే తెలంగాణలో మాత్రమే కాకుండా మొత్తం దేశ వ్యాప్తంగా ఉన్న ఓబీసీలకు న్యాయం జరగాల్సిన అవసరముందని, ఏ కులానికి కూడా అన్యాయం జరగకుండా పకడ్బందీగా కులగణన జరపాలన్నారు. గతంలో ఒకసారి కులగణన చేపట్టినప్పటికీ అది బయటకు కూడా రాలేదు. దేశ వ్యాప్తంగా ఒకే కులానికి చెందిన వారు చాలా పేర్లతో ఉంటారు. కులగణన చేపట్టేందుకు వెళ్లిన వారికి అవగాహన లేకుంటే ఆయా కులాలకు అన్యాయం జరుగుతుంది. ఒక రాష్ట్రం నుంచి ఇంకో రాష్ట్రానికి వలస వచ్చిన కులాలకు కూడా న్యాయం జరగాలి. ఒక సామాజిక పరిస్థితులుంటే కులాలపై అధ్యయనం చేసి వారిని గ్రూప్‌గా చేయాలి. వీటన్నింటినీ సక్రమంగా నిర్వహించాలంటే సమగ్రంగా ఒక విధానాన్ని రూపొందించాల్సి ఉందన్నారు. బీసీల ఆకాంక్షలకు అనుగుణంగా మొదటిసారి కులగణనన జరుగుతుంది.కనుక బీసీ మేధావులు, ప్రొఫెసర్లు, కుల సంఘాల నాయకులు, మేధావులు ఈ కులగణన సక్రమంగా జరిగేలా తమ అభిప్రాయాలు చెప్పాల్సి ఉంది. ఈ నెల 29 న కవిత గారి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నాం. చాలా మంది బీసీ నాయకులు, కుల సంఘాలు, ప్రొఫెసర్లు, రీసెర్చ్ విద్యార్థులను ఆహ్వానించాం. ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేసారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొడదాం..

## -రూరల్ సీఐ డి. చవాన్

### -కంచికచర్లలో డ్రగ్స్ పై దండయాత్ర.. సైకిల్ ర్యాలీ.

అమరావతి, జనవరి 27:కంచికచర్ల పట్టణంలో డ్రగ్స్ పై దండయాత్ర కార్యక్రమం రూరల్ సీఐ డి. చవాన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. పట్టణంలోని పలు వీధుల్లో యువతకు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రగ్స్ పై దండయాత్ర కార్యమానికి నందిగామ రూరల్ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ ల నుండి విద్యార్థులు, పోలీసు సిబ్బంది, ప్రజలు భారీగా తరలి వెళ్లారు.ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో చేపట్టిన డ్రగ్స్ పై దండ యాత్ర కార్యక్రమం మంగళవారం విజయవాడ ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం వద్ద నుండి ప్రారంభం అవుతున్నది. సైకిల్ యాత్రలో పాల్గొనుటకు రూరల్ జోన్ డిసిపి బి. లక్ష్మి నారాయణ ఉత్తర్వుల మేరకు, నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్ అద్వర్యంలో నందిగామ రూరల్ సీఐ డి. చవాన్ నేతృతంలో కంచికచర్ల లోని పలు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు భారీగా విజయవాడ తరలి వెళ్లారు.

ఈ సందర్భంగా సీఐ డి. చవాన్ మాట్లాడుతూ నేటి యువత చైతన్య వంతులు కావాలని, డ్రగ్స్ కు బానిసలై పలు నేరాలకు పాల్పడుతున్నారని, మహిళలపై అఘాయిత్యాలు దోపిడీలు దొంగతనాలు హత్యలు ఆత్మహత్యలు మహిళలపై అఘా యిత్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుండి తరిమి కొట్టేందుకు ప్రజల్లో చైతన్యం కలిగించేలా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సిఐ డి. చవాన్ తెలిపారు.

సే నో టు డ్రగ్స్ అంటూ విద్యార్థులు ప్ల కార్డులు చేతపట్టి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పోలీస్ విద్యార్థుల ప్రదర్శన జుజ్జూరు రోడ్డు, నెహ్రూ సెంటర్, బస్టాండు, పోలీస్ స్టేషన్ మీదగా పట్టణంలో కొనసాగింది. విద్యార్థులందరూ ప్రదర్శన అనంతరం విజయవాడ డ్రగ్స్ పై దండయాత్ర కార్యమానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల ఎస్సై పి. విశ్వనాథ్, ఎస్సై 2 జి. నాని నరేంద్ర, వీరులపాడు, ఎస్ఐ బి. అభిమన్యు, సర్కిల్ సిబ్బంది, మహిళా పోలీస్ లు, మిక్, ఎం వి ఆర్, అమృత స్థాయి ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలందరిపైన జగజ్జనని అనుగ్రహం, ఆశీస్సులు..

### -అమ్మ దయతో ఏపీలో అభివృద్ధి పరుగులు..
### -విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేసినేని శివనాద్..
### -కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
### -కృష్ణ పుష్కరాల నాటికి ఇంద్రకీలాద్రిపై సకల సౌకర్యాలు ఏర్పాటు



విజయవాడ, జనవరి 27: రానున్న కేంద్ర బడ్జెట్ సమావేశాలలో రాష్ట్రానికి మేలు జరగాలని, నిధుల కేటాయింపు ఎక్కువగా జరగాలని, రాష్ట్రాభివృద్ధి పై ఆ జగజ్జనని అనుగ్రహం, ఆశీస్సులు వుండాలని ప్రార్థించినట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం లో అమ్మవారిని మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ తన తల్లి ప్రసునాంబ, భార్య జానకి లక్ష్మీతో కలిసి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్ తో పాటు కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో వేద పండితులు, ఆలయ అధికారులు, ఆలయ బోర్డ్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఎంపి కేశినేని శివనాథ్ కుటుంబ సభ్యులను వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మీడియా తో మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాబోయే కృష్ణ పుష్కరాల నాటికి ఇంద్రకీలాద్రిపై సకల సౌకర్యాలు సమకూరతాయన్నారు.ఇంద్రకీలాద్రి ఆలయం మరింతగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. రాష్ట్రంతో పాటు దేశం సుభిక్షంగా వుండటంతో పాటు అభివృద్ధి చెందాలని అమ్మవారిని మన స్ఫూర్తిగా కోరుకోవటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం బోర్డు మెంబర్స్ బాడేటి ధర్మారావు, సుఖాసి సరిత, మన్నె కళావతి, తాగూర్ పద్మావతి, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర్ బాబు, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ సుఖాసి కిరణ్, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి యాదవ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.వి.వి వెంకట రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ పాటు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మలకు సబ్బినాటితో అనుబంధం

## జనవరి 28 నుండి 31 వరకు మేదారం జాతర

దేశ మాతృ గౌరవాన్ని కాపాడేందుకు ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా విడిచి పెట్టిన అమర వీరులను ఆరాధించే సత్సం ప్రదాయం హైందవ సంస్కృతిలో ఉంది. సమున్నత ఆశయ సాధనకోసం జీవితాలను త్యాగం చేసిన సమ్మక్క, సారలమ్మలను దైవాంశ సంభూతులుగా ఉత్తర తెలంగాణ జాన పదులు ఆరాధ్య దైవాలుగా కొలవడం సదాచారంగా మారింది. దాదాపు 900 సంవత్సరాల చారిత్రక నేపథ్యం కలిగిన వన దేవతల జాతర పూర్తిగా గిరిజన సాంప్రదాయంలోనే సాగుతుంది. అయితే గిరిజనులే కాక, గిరిజనే తరులు సైతం గద్దెలెక్కిన దేవతల ను కొలవడం వంశపారం పర్య ఆచరణగా కొనసాగుతున్నది. కాకతీయులు మొదట సబ్బినాడు (కరీంనగర్) లోనే రాజ్యము చేసి, చాళుక్యుల దయచే అనుమకొండను సంపాదించారనే భావనకు, ప్రస్తుత జగిత్యాల జిల్లాలోని పొలవాసలో ఏకశిలా దేవి కాకతీ యుల కులదైవం మందిరం ఆనాడు ఉండడం ఊతమిస్తున్నది. కాకతీయులలో మూడవ రాజైన రెండవ బేతరాజు, మహా మండలేశ్వర మేడరాజుకు సామంతుడని శాసనాధారులున్నాయి. జగిత్యాల జిల్లాలో అర్వెల్లి (ఆరువేల గ్రామం)లో నేటికీ ఎత్తైన అర్వెల్లి నాయకమ్మ విగ్రహం కలిగి, ఏటా జాతర జరుగు తున్నది. బేతరాజు సబ్బి సహస్రం (ఆరువేల నాడు)ను పాలించాడని చరిత్రకారుల భావన. బేతరాజు తర్వాత రెండవ ప్రోల రాజు రాజై, జగిత్యాల సమీప పొల వాస రాజ్యాన్ని ఏలే మేడరాజును గెల్చి, సామంతునిగా నిలిపాడని, అలాగే మంత్రకూటపు (మంథెన) రాజైన గుండె రాజును గుండారం వద్ద ఓడించి, అవమాన పరిచాడని, గుండెరాజు, మేడరాజు అన్నదమ్ము లని పరిశోధనలు జరిగాయి. ప్రోలుని తర్వాత రాజైన కాకతీయ రుద్రుడు నగునూరుపై దండెత్తి దొమ్మ రాజును ఓడించాక, పొలవాసపై దండెత్తగా, మేడరాజు పారిపోగా, హుస్నాబాద్ సమీప ఆకునూరుకు చేరుకుని, మూల సైనిక బలంతో మైళగి దేవుని కళ్యాణి వరకు తరిమిన క్రమంలో, రుద్రరాజు స్వతంత్రుడైన సందర్భం లో, యావదాంధ్రదేశం రుద్రుని పాలన కిందకు 1162లో వచ్చినట్లు చరిత్రకారులు తెలుగు ప్రజలందరిని ఒక్కటిగా చేసిన సంవత్సరం గా గుర్తించారు. మేడరాజు తమ్ముడగు ఏడెరాజు వేయించిన శాసనం రామగుండం వద్ద లభించుటచే ఏడెరాజు ఆప్రాంత సామంతుడుగా ఉండినట్లు అభి ప్రాయాలున్నాయి. గణపతి దేవుని కాలాన కరీంనగర్ జిల్లా మొత్తం సామంత పల్లవుల పాలనలో ఉండెనని తెలుస్తున్నది. గణపతి దేవుని తర్వాత రుద్రమ సింహాస నమెక్కింది. కాకతీయులలో చివరివాడు ప్రతాప రుద్రుడు. స్థానిక కథనాల ప్రకారం పొలవాస ను పాలించిన మేడరాజు ఏకైక పుత్రిక సమ్మక్కను తన మేనల్లుడైన మేడారం పాలకుడగు పగిడిద్దరాజు తో వివాహం జరిపించాడు. వారికి సారలమ్మ నాగులమ్మ, జంపన్న అనే సంతానం కలిగారు. ప్రతాప రుద్రుడు పొలవాసపై దండెత్తగా, మేడరాజు పోరిపోయి, పగిడిద్ద రాజుకు ఆశ్రయుడైనట్లు, పడిగిద్ద రాజుపై ఆగ్రహించిన ప్రతాప రుద్రుడు మాఘ పౌర్ణమినాడు మేడారం పై దండెత్తినట్లు, మేడ రాజు, పగిడిద్ద రాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజు యుద్ధం లో వీరస్వర్గం పొందినట్లు, సమ్మక్క సైతం కాకతీయలతో వీరోచితంగా పోరుసల్పి, గిరిజన యుద్ధ తంత్రాన్ని ప్రదర్శించినట్లు ప్రచారంలో ఉంది.



సమ్మక్క యుద్ధ భూమిలో కాకలు తీరిన కాకతీయుల సైన్యాన్ని ముప్పు తిప్పలు పెడుతుంది, వీరోచితంగా పోరాటం సాగించింది. గిరిజన మహిళ యుద్ధ నైపుణ్యానికి ప్రతాప రుద్రుడు ఆశ్చర్య చకితుడయ్యాడు. చివరికి శత్రువుల చేతిలో దెబ్బతిన్న సమ్మక్క రక్తపు ధారలతోనే యుద్ధ భూమి నుంచి నిష్క్రమించి చిలుక గుట్ట వైపు వెళుతూ మార్గ మధ్యంలోనే అదృశ్యమైంది. సమ్మక్కను వెదుక్కుంటూ వెళ్లిన అనుచరులకు ఆమె జాడ కనిపించలేదు, కానీ ఆ ప్రాంతములో ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమలు గల భరిణె లభించింది. దాన్ని సమ్మక్కగా భావించి అప్పటి నుంచి రెండేళ్లకు ఒకసారి పెద్ద జాతర, అలాగే మినీ జాతర మాఘ శుద్ధ పౌర్ణమి రోజున అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపు కుంటున్నారు.

అవిభక్త కరీంనగర్ జిల్లాతో విడదీయరాని అను బంధం, సంబంధం కలిగిన సమ్మక్క - సారలమ్మలకు అత్యధికంగా వనదేవతల గద్దెలున్నాయి. దేవాదాయ శాఖలో రిజిస్ట్రేషన్ అయినవి కరీంనగర్ జిల్లాలో 41 కాగా, వరంగల్ జిల్లాలో 12 ఉన్నాయి. ఆదిలాబాద్ లో వేళ్ళపై లెక్కించేవి కాగా, ఇతర జిల్లాలలో బహుస్వల్పం.

మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జనవరి 28 నుండి 31 వరకు నిర్వహించేందుకు కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర ఘనంగా జరుగనుంది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సమ్మక్క- సారలమ్మ మేడారం జాతరలో భాగంగా నాలుగు రోజులపాటు వివిధ కార్యక్రమాలను అర్చకులు నిర్వహించ నున్నారు.

### నాలుగు రోజులలో ఏరోజు ప్రత్యేకత ఆ రోజుకు ఉంది.

ఉత్తర తెలంగాణ నుండి అధిక సంఖ్యాకులైన భక్తులు ఈ జాతరకు సనాతన సంప్రదాయ వారసత్వ ఆచారంలో భాగంగా క్రమం తప్పకుండా వెళ్లడం పరిపాటి. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేవిధంగా ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు.

జనవరి 28 నుంచి 31 వరకు జాతర నాలుగు రోజుల పాటు జరుగుతుంది. తొలి రోజు జనవరి 28న సాయంత్రం 6 గంటలకు కన్నెపల్లి నుంచి సారలమ్మను, గోవింద రాజు, పగిడిద్ద రాజులను గద్దెపైకి తీసుకు రావడంతో జాతర ప్రారంభం అవుతుంది. రెండో రోజు 29న సాయంత్రం 6 గంటలకు చిలకల గుట్ట నుంచి సమ్మక్క దేవతను గద్దె మీదకు తీసుకొస్తారు. 30న వన దేవతలకు భక్తులు తమ తమ మొక్కులను చెల్లించే కార్యక్రమం ఉంటుంది. 31న సాయంత్రం 6 గంటల సమయంలో సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవింద రాజు, పగిడిద్ద రాజు దేవుళ్ల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

## ప్రతిభ పోటీలోకృష్ణవేణి విద్యార్థినికి బహుమతి



రాజన్న సిరిసిల్ల, జనవరి 27: నేటినిజం ప్రతినిధి): కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని దుగ్గ శ్రీనిక ప్రతిభ పోటీలలో డివిజీనల్ స్థాయిలో మూడవ బహుమతిని సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా వేములవాడ అర్బన్ ఎంఈవో సదానందం దుగ్గ శ్రీనిక బహుమతి ప్రధానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ నన్నిధి వెంకటకృష్ణ అభినందించారు. విద్యార్థులు పోటీ పరీక్షలలో పాల్గొంటూ, విజేతలుగా నిలిచి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## యువగళం పాదయాత్ర ఒక చంచలనం

### -టిఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ మాజీ అధ్యక్షులు మోతె రాజిరెడ్డి



రాజన్న సిరిసిల్ల, జనవరి 27: నేటినిజం ప్రతినిధి): యువగలం పాదయాత్ర రాష్ట్ర చరిత్రలో ఒక సంచలనమని టిడిపి వేములవాడ కమిటీ సభ్యులు, టిఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ మాజీ అధ్యక్షులు మోతె రాజిరెడ్డి అన్నారు. రాష్ట్ర ఐటి, విద్య శాఖా మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర చేసి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మోతె రాజిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, తెలుగుజాతిని కాపాడడానికి చేసిన పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బడుగులు, బలహీనులు, పేదలు, మహిళలు, యువకులు, రైతులు వారి కష్టాలను, కన్నీళ్లను తెలుసుకుంటూ 226 రోజులు 3132 కిలోమీటర్లు 97 నియోజకవర్గాలు 2094 గ్రామాలు 1.5 కోట్ల మంది గుండె తలుపులను తడుతూ ఆనాడు మంత్రి నారా లోకేష్ యువగళం సాగిందని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి రావడానికి యువగళం గేమ్ చెంజర్ గా పని చేసిందన్నారు.

## వైభవంగా చిన్న మేడారం జాతర ప్రారంభం



రాజాపేట, జనవరి 27 : కోరిన కోరికలు తీర్చి కొంగుబంగారంగా నిలిచే తెలంగాణ ప్రజల ఆరాధ్య దేవతలైన సమ్మక్క సారక్క వనదేవతల జనజాతర ఎల్లమ్మ బోనాలతో మంగళవారం రాజాపేట మండలంలోని చిన్నమేడారంలో వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మండలంలోని కుర్రారం, బూర్గుపల్లి గ్రామ మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో డప్పు చప్పుల మధ్య శివసత్తుల పూనకాలతో ప్రదర్శనగా వెళ్లి ఎల్లమ్మ దేవతకు బోనాలు సమర్పించారు. దేవతకు పసుపు, కుంకుమ గాజులు, వడి బియ్యాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వన దేవతలకు సమర్పించుకునేందుకు భక్తులు ఒడి బియ్యాలు, బంగారం, గొర్రెలు, మేకలు, ఇతర వంట సామగ్రి తీసుకుని వాహనాలల్లో జారతకు పెద్ద ఎత్తున చేరుకుంటుడడంతో మెల్లమెల్లగా ప్రాంతమంతా జనార్యణంగా మారుతుంది. ఆలయం పరిసరాలల్లో పెద్ద ఎత్తున్న దుకాణాలు, హోటళ్లు వెలిశాయి.

గద్దెలకు సుమారు 2 కిలో మీటర్ల దూరం వరకు చెట్టూ, పుట్ట, చేను, సెలకల్లో భక్తులు తమ విడిది స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. అడవి తల్లుల ఆగమనం అనంతరం మొక్కలు సమర్పించుకోవాలని దృఢ సంకల్పంతో వన దేవతల రాక కోసం ఎదురు చూస్తున్నారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల ఆరాధ్యదైవమైన సారలమ్మ నేడు కుర్రారం శివారులోని ఏదుల గుట్ట వద్ద ప్రత్యేక పూజలు స్వీకరించి అనంతరం గద్దెనెక్కనుంది. ఆ సమయంలో వన దేవతల ఆలయ ప్రాంతం జనసంద్రం కానుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఇక్కడి వన దేవతల జాతర పెద్ద మేడారం జాతర తరహాలో జరుగనుంది.

## డివిజన్ల విభజన అశాస్త్రీయంగా జరిగింది

### జిహెచ్ఎంసి ఎన్నికల పై ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ జనవరి 27 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); జిహెచ్ఎంసి డివిజన్ల విభజన అశాస్త్రీయంగా జరిగిందని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. జిహెచ్ఎంసి డివిజన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఒక దగ్గర 82 వేలు ఉంటే మరో దగ్గర 12 వేలు జనాభా మాత్రమే ఉంది. ఇది ఆశాస్త్రీయంగా ఉంది. రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని కాకుండా ప్రజల సౌకర్యార్థం 30 వేలు ఒక్కొక్క కార్పొరేటర్ కి సమానంగా డిస్ట్రిబ్యూట్ చెయ్యాలని,. పారదర్శకత్వంతో రిజర్వేషన్ కూడా కేటాయించాలని డిమాండ్ చేసారు .స్థానిక సంస్థలు బలోపేతం కాకుండా వాటిల్లో పరిపాలన లేకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వం వ్యవస్థ నడుపుతామంటే అది వెర్రి బాగులతనం అవుతుంది.

ఇలాంటి నిర్ణయం తీసుకునేటప్పుడు కనీసం పార్టీలతో ప్రజాప్రతినిధులతో చర్చలు జరపాలి. నాకే అన్నీ తెలిసినట్టు రేవంత్ రెడ్డి సర్కారు చేస్తుంది ఇది మంచి పరిణామం కాదు. రాజకీయ లబ్ధికోసం చిల్లర రాజకీయాల కోసం విభజన చేయవద్దని హితవు పలికారు.

## ఉద్యోగుల హక్కులను కాపాడుతాం

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

ఉద్యోగస్తుల హక్కులను కాపాడుతాం. ముఖ్యంగా మైనారిటీ ఉద్యోగస్తుల హక్కులు కాపాడుతామని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ 2026 డైరీ, క్యాలెండర్ను చిన్నారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా మైనార్టీలకు రావలసిన హక్కులను కాపాడటంలో అవసరమైతే పోరాటం చేసి వాటిని అమలు అయ్యేట్లు కాంగ్రెస్ పార్టీ పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ మే వావా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఫరూక్ హుస్సేన్, డాక్టర్ వహీద్ షా ఖాద్రి, కోశాధికారి ఏం. ఏ. రషీద్, రాష్ట్ర నాయకులు జావేద్ అహ్మద్, తక్వుద్దీన్ అహ్మద్, ప్రవాస భారతీయుడు మహమ్మద్ వాజీద్, సయ్యద్ అజమ్ హుస్సేన్, ఖాజా ఫరూఖ్ అలీ, ముంతాజ్ అలీ, అతి ఖుర్ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు

## 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ

ఖమ్మం, జనవరి 27: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని పెట్రాంచెలక సమీపంలో గల 25 కె.వి ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామ సమీప చేనులో 25 కె.వి ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్ ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను చోరీ చేశారు. ఈ ఘటనపై టేకులపల్లి ఏఈ హోట్కర్ దేవా బోడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవలే ముత్యాలంపాడు క్రాస్ రోడ్ సమీపంలో కూడా ట్రాన్స్ ఫార్మర్ కాపర్ వైర్ ను దొంగలు అపహరించుకుపోయారు. కాపర్ వైర్ దుండగులను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

## మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### - వేములవాడ ఆలయ అభివృద్ధి మా బాధ్యత..

### - మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జనవరి 27: నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఆలయ అభివృద్ధి మా బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి, భీమేశ్వర స్వామి వారిని మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆశీస్సులు అందరి పై ఉండాలని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న సందర్భంలో ఫిబ్రవరి లో ఎన్నికలు జరుగున్నాయనీ, 121 మున్సిపాలిటీలు ,10 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. అనివార్య కారణాల వల్ల 10 మున్సిపాలిటీ లకు ఎన్నికలు జరగడం లేదని, అన్ని మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో మున్సిపాలిటీలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. మున్సిపాలిటీల్లో ప్రభుత్వం అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ఒక్క డబుల్ బెడ్ రూం ఇవ్వలేదనీ, మేము నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదనీ, మేము రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. దేశంలో ఉన్న ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ లో మాత్రమే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. పేద ప్రజలు నెలకు 1000 రూపాయల కరెంట్ బిల్లు కట్టే పరిస్థితి ఉండేదనీ, మేము నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. మహిళలు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా వేములవాడ ,సమ్మక్క సారలమ్మ జాతర కి వెళ్ళిన ఉచితంగా ప్రయాణం చేస్తున్నారనీ, తెలంగాణ ప్రభుత్వం 9 వేల కోట్ల విలువైన ప్రయాణం ఉచితంగా చేశారని, భుత్వం ఆర్టీసీకి డబ్బులు చెల్లిస్తుందన్నారు. రైతాంగానికి రైతు భరోసా, రైతు రుణమాఫీ సన్న వడ్లకు 500 బోనస్ ఇచ్చామని, నిరుద్యోగులు గత 10 సంవత్సరాలుగా ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. మా ప్రభుత్వంలో ఉద్యోగాలు జాబ్ క్యాలండర్ ద్వారా వేగంగా భర్తీ చేస్తున్నామనీ, తెలంగాణ విజన్ 2047 ద్వారా గ్రామీణ ,పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నామని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కేటీఆర్ బాకీ కార్డు పట్టుకొని తిరిగారనీ, అయిన ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించారనీ, వారు ఉప ఎన్నికల్లో,సర్పంచ్ ఎన్నికల్లో ఓడిపోయి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. కేసీఆర్ కూతురు ,కేటీఆర్ సోదరి హరీష్ రావు మరదలు కవిత అడుగుతున్న ప్రశ్నలకు జవాబు చెప్పాలనీ పేర్కొన్నారు. కొంత మంది నాయకులకు వేములవాడ ఉందని కూడా జ్ఞాపకాలు లేదనీ, 12 సంవత్సరాలుగా వేములవాడకి అమృత్ ఎందుకు తేలేదన్నారు. ఇప్పుడు వేములవాడకి అమృత్ తీసుకొస్తామని చేస్తున్నార న్నారు. వేములవాడకి అమృత్ ఇవ్వండి స్వాగతిస్తాం కానీ ఎన్నికల కోసం అమృత్ ఇస్తాం అని అంటే పొరపాటు అవుతుంది మొన్నటి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా వేములవాడ అభివృద్ధిపై డిమాండ్ చేశామన్నా డు. మేము అధికారంలోకి రాగానే శాసన సభ్యుడు ఆధ్వర్యంలో మొత్తం కేబినెట్ ముఖ్యమంత్రి ఇక్కడికి వచ్చి వేములవాడ అభివృద్ధికి శంకుస్థాపన చేసుకున్నామని పేర్కొన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయనీ, వేములవాడ ఆలయ అభివృద్ధి మా బాధ్యత.. అన్నారు. ప్రతిపక్షంలో ఉద్యమించాం.. అధికారంలోకి రాగానే నెరవేరుస్తున్నాం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున అనేక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. మేము అధికారంలోకి వస్తే అప్రకటిత కరెంట్ తొలగింపు అన్నారనీ, రాష్ట్రంలో ఎక్కడైనా కరెంట్ పోతుందా అని గుర్తు చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నా ఎక్కడ ఇబ్బంది లేదనీ, వేములవాడ బస్ స్టేషన్ ఆది శ్రీనివాస్ కోరిక మేరుకు అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఉదయం శంకుస్థాపన చేసుకోవాల్సిందనీ, టెండర్ ప్రక్రియ జరుగుతుందన్నారు. చందుర్తి బస్ స్టాండ్ అభివృద్ధి చేస్తున్నామనీ,కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, అర్బన్ అభివృద్ధి జరుగుతుందనీ స్పష్టం చేశారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనీ, విద్యా ,వైద్యం బాగుండేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాల తొలగింపు ఉండదనీ, జిల్లాలు తొలగిస్తామని ఎవరు అనలేదన్నారు. సాంకేతికంగా హద్దులు వద్ద ఇబ్బందులు ఉన్నాయనీ, మా హుస్నాబాద్ బలవంతంగా సిద్దిపేటలో కలిపారు.. దానిని కరీంనగర్ లో కలుపుతామన్నారు. అది సిట్టింగ్ జడ్జి తో కమిటీ వేసి భవిష్యత్ లో ఉంటుందనీ వెల్లడించారు.



## నాగదేవుతా హుండి ఆదాయం రూ. 8,93,797



ఆదిలాబాద్, జనవరి 27: అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర ఈ నెల 18 నుంచి 25 వరకు జరుగగా భక్తులు కట్నం కానుకల రూపములో సమర్పించిన హుండీ ఆదాయం మంగళవారం నాడు లెక్కించారు.

మొత్తం హుండీ ఆదాయం 8,93,797 లు వచ్చినట్లు ఇఓ తెలిపారు. 0.252 గ్రాముల వెండి వచ్చినట్లు తెలియ జేశారు.

తై బజార్ ఆదాయం తో పాటు ఖర్చుల వివరాలను దీంతో జాతర లో వచ్చిన ఆదాయనీ, ఎండోమెంట్ ప్రకారంగా ఖర్చులు, మిగిలిన అమౌంట్ వెల్లడించడం ఆనవాయితీ.

ఈ సందర్భంగా ఐటిడిఏ అధికారులు, పోలీస్ సిబ్బందులు, పూర్తి బందోబస్తుతో మేశ్రమ వంశీయుల ఉద్యోగా సంఘం పీఠాధిపతి, మేశ్రమ పీఠాధిపతి వెంకటరావు, ఆలయ చైర్మన్ ఆనంద్ రావు, సర్పంచ్ మేశ్రమ తుకారం, పూజారి, సేకు ఉద్యమ సంఘం మెస్రం సోనే రావు, మేశ్రమ శేఖర్, మేశ్రమ మనోహర్, ఉద్యోగ సంఘం ఉపాధ్యాయులు, మేశ్రమ రెడ్డి పటేల్, కటోడా హనుమంతరావు, మేస్రం కోసేరావులు ఉన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com